మార్నింగ్ కాఫీ విత్ హాట్ న్యూస్‌తో...! మీ

# డ్రీమ్ టైమ్స్

తెలుగు దిన పత్రిక

సోమవారం 06-04-2026
పేజీలు: 8 వెల: రూ.2/-

సంపుటి:5 సంచిక 166

Published from Kurnool circulated all over Andhra Pradesh and Telangana All District

**విలేకరులు కావలెను**





తెలంగాణ ,ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా డ్రీమ్ టైమ్స్ దినపత్రికలో బ్యూరో, మండలాల రిపోర్టర్ గా పని చేయుటకు జిల్లాల, నియోజకవర్గ స్థాయిలో ఉత్సాహవంతులైన యువతి ,యువకులు కావలెను, కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును


**8500066609**

# గ్రామ సమూహ ఐక్యత..
# బయనపల్లి శ్రీరాముడి ఘనత



## 93 ఏళ్ల సాంప్రదాయం







- దేశ విదేశాల నుంచి తరలివచ్చే స్వగ్రామవాసులు
- రూ.50 లక్షల బాణాసంచాతో కనువిందు
- కులమతాలకు అతీతంగా లక్షలాది మందితో మహాసమ్మేళనం

**తిరుపతి బ్యూరో ఇంచార్జ్ ( డ్రీం టైమ్స్ )**

పోటీ, ఆధిపత్యం, స్వార్థ ప్రయోజనాలే నేటి సమాజాన్ని నడిపిస్తున్న ఈ కాలంలో... ఒక గ్రామం మాత్రం ఐక్యతకు ప్రతీకగా నిలుస్తోంది. అది తిరుపతి జిల్లా రైల్వే కోడూరు సమీపంలోని బయనపల్లి. ఇక్కడ జరిగే

**ఐదు గ్రామాల ఐక్యతకు వేదికగా శ్రీరామనవమి**

## తరతరాల అనుబంధం

శ్రీరామనవమి ఉత్సవాలు కేవలం పండుగ కాదు... అది సామూహిక చైతన్యం, సంస్కృతి, సంప్రదాయం, సమానత్వం కలయిక. 93 సంవత్సరాలుగా నిరంతరాయంగా కొనసాగుతున్న ఈ ఉత్సవాలు ఇప్పుడు ఐదు గ్రామాల ఐక్యతకు ప్రతీకగా మారాయి.

**ఐదు గ్రామాలు... ఒకే ఉత్సవం**

బయనపల్లి, ఓబనపల్లి, గిరిజన కాలనీ, దళితవాడ, అరుంధతివాడ...

ఈ ఐదు ప్రాంతాల ప్రజలు కులమత భేదాలు లేకుండా ఒకే వేదికపై కలుస్తారు. ప్రతి గ్రామం నుంచి ఉత్సవ మూర్తులు రథాలపై బయలుదేరి గ్రామ మధ్యలోని కూడలిలో కలుసుకునే వేళ ఐక్యతకు ప్రతీకగా నిలిచే అరుదైన దృశ్యం ఆవిష్కృతమవుతుంది. ఒక్కరోజే సుమారు లక్ష మందికి పైగా హాజరవుతుండటం ఈ ఉత్సవాల వైభవాన్ని చాటి చెబుతోంది. -మిగతా 3 లో







# జలమే జీవం

## నీటి సంరక్షణపై 100 రోజుల ప్రణాళిక



- నేటి నుంచి జూలై 14 దాకా కార్యక్రమం
- సాగునీటి సంఘాలకు బాధ్యతలు
- ప్రజల భాగస్వామ్యంతో నిర్వహణ
- టెలికాన్ఫరెన్స్‌లో చంద్రబాబు దిశానిర్దేశం
- నీటి సంరక్షణ బాధ్యత అందరిదీ
- తద్వారా రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి
- భూగర్భ జలాలు పెంచాలని సూచన
- నేడు అనంతపురం జిల్లాలో సీఎం పర్యటన

**అమరావతి,**

ప్రతి ఒక్కరూ నీటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. నీటి భద్రతతోనే రాష్ట్రం సమగ్రాభివృద్ధి చెందుతుందని అన్నారు. జల సంరక్షణ ప్రధాన అజెండాగా రాష్ట్రవ్యాప్తంగా 100 రోజుల కార్యక్రమాలను చేపట్టాలని సాగునీటి సంఘాలకు దిశానిర్దేశం చేశారు. దీనిని సోమవారం నుంచి జూలై 14వ తేదీ వరకూ సామాజిక ఉద్యమంలా నిర్వహించేలా కార్యాచరణ ప్రణాళిక ప్రకటించారు. ఆదివారం సాగునీటి వినియోగదారుల సంఘాలతో చంద్రబాబు టెలీకాన్ఫరెన్సు నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 60,000 మంది సభ్యులకు బాధ్యతలు అప్పగించారు. జలవనరులు, అటవీ, పంచాయతీరాజ్, వ్యవసాయ, పశుసంవర్ధక శాఖల సమన్వయంతో -మిగతా 3 లో



# దద్దరిల్లిన గల్ఫ్..

- ఇంధన సదుపాయాలే లక్ష్యంగా ఇరాన్ భీకర దాడులు
- కువైట్‌లో పవర్, డీశాలినేషన్ ప్లాంట్లపై క్షిపణులు, డ్రోన్ల వర్షం
- బహ్రెయిన్‌లో ఆయిల్ రిఫైనరీపై దాడి.. పెద్ద ఎత్తున మంటలు
- యూఏఈలో పెట్రో కెమికల్ ప్లాంట్‌పైనా విరుచుకుపడ్డ ఇరాన్
- ఇజ్రాయెల్‌లో డ్రోన్ల ఫ్యాక్టరీ ధ్వంసం
- ఇరాక్‌లో అమెరికా ఎంబసీలపై ఇరాన్ మద్దతు గ్రూపుల దాడి

**టెహ్రాన్,**

పశ్చిమాసియా యుద్ధం రోజురోజుకూ ఉధృతమవుతున్నది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరికలకు ఇరాన్ ఏమాత్రం తలొగ్గడం లేదు. ఇరాన్ దాడులతో ఆదివారం గల్ఫ్ దేశాలు దద్దరిల్లాయి. ఆయా దేశాల్లోని ఇంధన సదుపాయాలే లక్ష్యంగా ఇరాన్ విరుచుకుపడింది. కువైట్, యూఏఈ, బహ్రెయిన్‌లపై డ్రోన్లు, క్షిపణుల వర్షం కురిపించింది. ఇజ్రాయెల్‌పైనా భీకర దాడులు చేపట్టింది. మరోవైపు ఇరాక్‌లోని అమెరికా దౌత్య కార్యాలయాలే లక్ష్యంగా ఇరాన్ మద్దతు గ్రూపులు దాడులు చేపట్టాయి.

**కువైట్‌లోని విద్యుత్, డీశాలినేషన్ ప్లాంట్లపై దాడి**

కువైట్‌లోని ప్రధాన విద్యుత్తు, డీశాలినేషన్ ప్లాంట్లపై ఇరాన్ డ్రోన్ దాడులకు దిగింది. -మిగతా 3 లో



# హెర్మూజ్‌ను తెరవండి.. లేదంటే!

- పవర్ ప్లాంట్లు, బ్రిడ్జిలు పేల్చేస్తాం
- చమురు వనరులను స్వాధీనం చేసుకుంటాం
- ఇరాన్‌కు మరోసారి డొనాల్డ్ ట్రంప్ తీవ్ర హెచ్చరికలు

**వాషింగ్టన్**

ఇరాన్‌తో యుద్ధంలో వరుస ఎదురు దెబ్బలు తగులుతుండటంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సహనం కోల్పోతున్నారు. ఈ క్రమంలో ఆయన ఆదివారం ఇరాన్‌పై తీవ్ర పదజాలంతో హెచ్చరికలు చేశారు. హెర్మూజ్ జలసంధిని తెరువకపోతే ఇరాన్‌లోని పవర్‌ప్లాంట్లు, బ్రిడ్జిలను పేల్చివేస్తామని హెచ్చరించారు. ఇది యుద్ధంలో నిర్ణయాత్మక క్షణమని, మరో రెండు రోజుల్లో ఇరాన్‌పై దాడులను ఉధృతం చేస్తామని చెప్పారు. హెర్మూజ్‌ను తెరువాలంటూ ఇరాన్‌ను తీవ్ర పదజాలంతో దూషించారు. లేదంటే మీకు నరకం చూపిస్తానని హెచ్చరించారు. ఇరాన్‌తో చర్చలు కొనసాగుతున్నాయని, ఒప్పందం కుదరకపోతే తీవ్ర పర్యవసనాలు ఎదుర్కొనవలసి వస్తుందని స్పష్టంచేశారు.మరికొన్ని గంటల్లో ఒప్పందం కుదిరే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. చర్చలు విఫలమైతే ఇరాన్‌లోని కీలక సదుపాయాలను పేల్చివేస్తామని, ఇరాన్ చమురు వనరులను స్వాధీనం చేసుకుంటామని పేర్కొన్నారు. 48 గంటల్లో హెర్మూజ్ తెరువాలంటూ తాను అల్టిమేటం జారీ చేసినా ఇరాన్ వెనక్కి తగ్గుతున్న సూచనలు కన్పించకపోవడంతో ట్రంప్ తాజా హెచ్చరికలు చేశారు. ఆదివారం గల్ఫ్‌లోని ఇంధన వసతులపై ఇరాన్ విరుచుకుపడింది.

-మిగతా 3 లో


# పశ్చిమ బెంగాల్‌లో మహా జంగిల్ రాజ్ ప్రభుత్వం..

- టీఎంసీ ప్రభుత్వం ప్రజా ధనాన్ని కొల్లగొడుతోంది
- అక్రమ చొరబాటుదారులకు మమత అండగా నిలుస్తోంది
- మాల్దా, సందేష్‌కాలి ఘటనలు ఆమె ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం.
- టీఎంసీ ప్రభుత్వంపై మోదీ ఫైర్



**న్యూఢీల్లీ**

పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ ఆధ్వర్యంలోని టీఎంసీ ప్రభుత్వం ప్రజా ధనాన్ని కొల్లగొడుతోందని విమర్శించారు ప్రధాని మోదీ. ఆదివారం ఆయన అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కూచ్ బెహర్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో మహా జంగిల్ రాజ్ నడుస్తోందన్నారు. టీఎంసీ పాలనపై మోదీ మండిపడ్డారు.పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ ప్రభుత్వ పతనం ప్రారంభమైంది. అక్రమ చొరబాటుదారులకు మమత అండగా నిలుస్తోంది. మాల్దా, సందేష్‌కాలి ఘటనలు ఆమె ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం. బెంగాల్‌లో మహా జంగిల్ రాజ్ (ఆటవిక రాజ్యం) నడుస్తోంది. ప్రజా ధనాన్ని టీఎంసీ కొల్లగొడుతోంది. కానీ, మే 4న ఎన్నికల ఫలితాలు వెలువడ్డ తర్వాత వారు దీనికి తగిన మూల్యం చెల్లించాల్సిందే. జనాభాలో మార్పుల కారణంగా ఒకవైపు మన నేలపైనే స్వేచ్ఛను కోల్పోతున్నాం. ఇంకోవైపు బీజేపీ ఉంది. సొంత నేలపై సగర్వంగా, -మిగతా 3 లో



3 లో

# ఉప్పల్‌లో సన్‌రైజర్స్‌కు నిరాశ..

- బోణీ కొట్టిన పంత్ టీమ్..!
- సన్ రైజర్స్‌పై లక్నో సూపర్ జెయింట్స్ విజయం
- ఉప్పల్‌లో జరిగిన మ్యాచ్‌లో 5 వికెట్ల తేడాతో విక్టరీ
- అజేయ హాఫ్ సెంచరీతో జట్టును గెలిపించిన పంత్

**వరుసగా మూడో మ్యాచులో ఓడిన సీఎస్కే**

3 లో



## మూడేండ్ల పసికందుపై గ్యాంగ్‌రేప్!..



**పట్నా, ఏప్రిల్ 5(డ్రీమ్ టైమ్స్):**
బీహార్‌లోని పాట్నాలో అత్యంత హేయమైన ఘటన చోటుసుకున్నది. డ్రగ్స్‌కు బానిసైన 22 ఏండ్ల యువకుడు, మరో ఇద్దరు కలిసి.. మేనకోడలైన మూడేండ్ల బాలికపై గ్యాం గ్‌రేప్‌నకు పాల్పడ్డారు. శుక్రవారం రాత్రి చోటుచేసుకున్న ఈ ఘటనలో బాధిత బాలికకు పాట్నాలోని ప్రభుత్వ దవాఖానలో చికిత్స అందిస్తున్నామని, దోషులకు కఠిన శిక్షపడేలా చూస్తామని జిల్లా పోలీస్ ఉన్నతాధికారి రంజన్‌కుమార్ ఆదివారం విలేకర్లకు తెలిపారు. ఇద్దరు నిందితులను అరెస్టు చేశామని, ఎఫ్‌ఎస్‌ఎల్ బృందం నుంచి వచ్చే నివేదిక ఆధారంగా తదుపరి దర్యాప్తు ఉం టుందన్నారు. బాలిక తల్లి పోలీసులకు తెలిపిన సమాచారం ప్రకారం, డ్రగ్స్‌కు బానిసైన నిందితుడు నిద్రిస్తున్న బాలికను చెట్లపొదల్లోకి ఎత్తుకెళ్లి దారుణానికి పాల్పడినట్టు చెప్పింది. బాలిక అరుపులతో చుట్టుపక్కల వాళ్లు అప్రమత్తమవడంతో బాలికను అక్కడే వదిలేసి ప్రధాన నిందితుడు సహా, అతడి స్నేహితులు ఘటనాస్థలం నుంచి పారిపోయారు. బాలికను గుర్తించిన తల్లిదండ్రులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు.

## బ్లాక్ బాక్స్ డాటా బయటపెట్టండి



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 5(డ్రీమ్ టైమ్స్):**
అహ్మదాబాద్ ఎయిరిండియా విమాన దుర్ఘటన జరిగిన 10 నెలలు దాటుతున్నది. ఈ ఘటనలో అత్యంత కీలకమైన కాక్‌పిట్ వాయిస్ రికార్డర్ (సీవీఆర్), బ్లాక్‌బాక్స్ డాటాను బహిర్గతం చేయాలని బాధిత కుటుంబాలు డిమాండ్ చేస్తున్నాయి. నష్టపరిహారంగా తమకు ఇస్తామంటున్న డబ్బును నిరాకరిస్తున్నాయి. బ్లాక్ బాక్స్ డాటాను కేంద్రం విడుదల చేయాలని కోరుతూ ప్రధాని మోదీకి వారంతా లేఖ రాశారు. 260 మంది మరణాలకు కారణమైన ఈ విమాన దుర్ఘటనలో ఎన్నో కుటుంబాలు తమ ఆప్తులను కోల్పోయాయి. బాధిత కుటుంబాలకు చెందిన 30 మంది శనివారం అహ్మదాబాద్‌లో సమావేశమయ్యారు.

## త్రిభాషా విధానాన్ని అమలుచేస్తామని దమ్ముంటే ప్రకటించండి..

- మోదీ-షాకు తమిళనాడు సీఎం స్టాలిన్ సవాల్



**చెన్నై ఏప్రిల్ 5(డ్రీమ్ టైమ్స్):**
తమిళనాడులో త్రిభాషా విధానాన్ని అమలుచేస్తామని దమ్ముంటే ప్రకటించండి అని తమిళనాడు సీఎం స్టాలిన్ ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు సవాల్ విసిరారు. శనివారం శంకరన్ కోవిల్‌లో జరిగిన ఓ ర్యాలీలో మాట్లాడుతూ తమిళనాడులో హిందీని అమలు చేయాలని ప్రయత్నిస్తూ బీజేపీ తన గొయ్యిని తానే తవ్వుకొంటున్నదని ఆయన తెలిపారు. 'ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు త్రిభాషా సూత్రాన్ని తమిళనాడులో అమలు చేసే దమ్ముందా?' అని ఆయన ప్రశ్నించారు. జాతీయ విద్యా విధానం (ఎన్‌ఈపీ) ప్రకారం 2026-27 విద్యా సంవత్సరం నుంచి ఆరో తరగతి విద్యార్థులు మూడు భాషలు అభ్యసించాలనే ప్రతిపాదనను సీబీఈఎస్‌ఈ ప్రవేశపెట్టింది. ఇందులో రెండు భారతీయ భాషలు తప్పనిసరిగా ఉండాలి. ఇంగ్లిష్‌ను విదేశీ భాషగా ఈ ప్రతిపాదనలో పొందుపరిచారు. తనపై ఎదురు దాడి చేసిన కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వ్యాఖ్యలను స్టాలిన్ తిప్పికొట్టారు. తమ రాష్ట్రానికి కేంద్రం విద్యా నిధులను నిలిపేసిందని ఆరోపించారు.

## ఈ ప్రాంతం మొత్తం తగలబడుతుంది!..

-అమెరికాకు ఇరాన్ హెచ్చరిక

**టెహ్రాన్, ఏప్రిల్ 5(డ్రీమ్ టైమ్స్):**



ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ఆదేశాలను వాషింగ్టన్ అనుసరిస్తున్నదని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బఘేర్ ఖాలీబాఫ్ ఆరోపించారు. ట్రంప్ అవివేక చర్యలు అమెరికా కుటుంబాలను ప్రత్యక్ష నరకంలోకి నెడుతున్నాయని పేర్కొన్నారు. నెతన్యాహు ఆదేశాలను పాటించేందుకే ట్రంప్ మొగ్గుచూపుతున్నందుకు ఈ ప్రాంతం మొత్తం తగలబడుతుందని ఆయన హెచ్చరించారు. ఎలాంటి తప్పులు చేయొద్దని, యుద్ధ నేరాలతో మీకు వచ్చే ప్రయోజనం ఏం ఉండదని ఆయన ట్రంప్‌నకు స్పష్టంచేశారు.

## ఇరాన్‌లో సుదీర్ఘ ఇంటర్నెట్ షట్‌డౌన్..

-యుద్ధం కొనసాగడమే కారణం



**టెహ్రాన్: ఏప్రిల్ 5(డ్రీమ్ టైమ్స్):**
ఇజ్రాయెల్-అమెరికాతో యుద్ధం కారణంగా ఇరాన్‌లో ఇంటర్నెట్ వినియోగంపై నిషేధం విధించి నెల రోజులు దాటింది. దీంతో ఆ దేశంలో ఎక్కువ కాలం కొనసాగుతున్న ఇంటర్నెట్ షట్‌డౌన్‌గా ఇది నిలిచింది. మానిటర్ నెట్‌బ్లాక్స్ కథనం ప్రకారం.. ప్రపంచంలో అత్యధిక కాలం ఇంటర్నెట్ నిషేధం ఇరాన్‌లోనే కొనసాగింది. 'అయిదు వారాల తర్వాత కూడా ఇంటర్నెట్ షట్‌డౌన్ కొనసాగుతున్నది. వైట్ లిస్టింగ్ వ్యవస్థ ద్వారా ఎంపిక చేసిన వినియోగదారులకు ఇంటర్నెట్ సదుపాయాన్ని కల్పించే మార్గాలను అధికారులు అన్వేషిస్తున్నారు. అయితే ఈ పరిస్థితి ఇరానియన్లను ప్రపంచంతో సంబంధం లేకుండా ఏకాకిని చేసింది' అని నెట్‌బ్లాక్స్ తెలిపింది.

## ఉత్సవంలా విడాకులు..

ఊరేగింపుగా ఇంటికి. కుమార్తెను తీసుకొచ్చిన మాజీ జడ్జి




**మీరట్ ఏప్రిల్ 5(డ్రీమ్ టైమ్స్):**
సంప్రదాయ సామాజిక వైఖరికి భిన్నంగా యూపీలోని మీరట్‌కు చెందిన ఓ మాజీ జడ్జి కుటుంబం విడాకులను మౌనంతో కాకుండా వేడుకలా జరుపుకొంది. బాధితురా లి న్యాయవాదుల కథనం ప్రకారం.. ప్రణీత వశిష్టకు ఓ ఆర్మీ మేజర్‌తో 2018లో పెండ్లి జరిగింది. కొన్ని రోజులకే అత్తింటి వారు ఆమెను శారీరకంగా, మానసికంగా వేధించ డం మొదలుపెట్టారు. ప్రణీతకు ఒక కొడుకు జన్మించిన తర్వాత కూడా వేధింపులు ఆగలేదు. దీంతో ఆమె విడాకుల కోసం కుటుంబ న్యాయస్థానంలో దరఖాస్తు చేసింది. ఈ నెల 4న విడాకులు మంజూరయ్యాయి. దీంతో కోర్టు నిర్ణయాన్ని ఆమె కుటుంబం 'కొత్త ప్రారంభానికి' సూచికగా భావించి దాన్ని వేడుకగా జరపాలనుకున్నది. ప్రణీత కోర్టు నుంచి బయటకు రాగానే ఆమెను మేళతాళాలతో ఊరేగింపుగా ఇంటి వరకు తీసుకెళ్లింది. 'వివాహ జీవితంలో సంతోషంగా లేని నా కూతురిని ఆ వాతావరణం నుంచి బయటకు తీసుకురావడం నా బాధ్యత. నేను అదే చేశాను' అని ప్రణీత తండ్రి శర్మ తెలిపారు. తన కు టుంబ సాయంతో తాను తిరిగి నిలదొక్కుకోగలిగానని బాధితురాలు పేర్కొన్నారు. 'పెండ్లి చేసుకోవాలనుకొనే ముందు మిమ్మల్ని మీరు చైతన్యపరుచుకోండి, స్వతంత్రంగా ఉండండి' అని ప్రణీత మహిళలకు సందేశమిచ్చారు.

## మహిళలకు భద్రత కేవలం పథకం కాదు..

# ప్రభుత్వ ప్రాథమిక బాధ్యత

**న్యూఢిల్లీ ఏప్రిల్ 5(డ్రీమ్ టైమ్స్):**
"మహిళలకు భద్రత కేవలం పథకం మాత్రమే కాదు, అది ప్రభుత్వ ప్రాథమిక బాధ్యత" అని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ తెలిపారు. మహిళా సమస్యలను ప్రధాని మోడీ పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. హింసకు గురైన మహిళలకు అండగా నిలిచే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన 'వన్ స్టాప్ సెంటర్ల (ఒఎస్‌సిఎస్)'కు సంబంధించిన సమస్యల పట్ల కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆదివారం సోషల్‌మీడియా పోస్ట్‌లో పేర్కొన్నారు. "ఒక మహిళ హింస నుండి రక్షణ కోసం వన్‌స్టాప్ సెంటర్ (ఒఎస్‌సి)కి చేరుకున్నప్పుడు.. ఆ మహిళలకు ఎందుకు సహాయం లభించడం లేదు. ఎందుకు ఆసంస్థ తలుపులకు తాళాలు కనిపిస్తున్నాయి. సిబ్బంది కొరత ఎందుకు ఉంది. దేశవ్యాప్తంగా వస్తున్న ఫిర్యాదులను ఎందుకు పట్టించుకోవడం లేదు" అని రాహుల్‌గాంధీ ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా పరిస్థితి సంతృప్తికరంగా ఉందని ప్రకటిస్తోందని, ఒక వేళ పరిస్థితి సంతృప్తికరంగా ఉంటే ఒఎస్‌సిలకు



సంబంధించి ఇన్ని సమస్యలు ఉన్నట్లు నివేదికలు ఎందుకు వెలుగులోకి వస్తున్నాయని కేంద్రాన్ని నిలదీశారు. భద్రత అనేది ప్రాధాన్యత అయినట్లైతే, ప్రతి ఐదుగురు మహిళల్లో ముగ్గురికి ఎందుకు సాయం ఇంకా అందడం లేదనది ప్రశ్నించారు. మహిళా,శిశు సంక్షేమ శాఖకు కేటాయించిన ప్రతి రూ.100లో కేవలం 60పైసలు మాత్రమే ఒఎస్‌సిల కోసం ఎందుకు ఖర్చు చేస్తున్నారని నిలదీశారు. మార్చి 27న లోక్‌సభలో నిర్వహించిన ప్రశ్నోత్తరాలలో రాహుల్ గాంధీ ఈ ప్రశ్నలను అడిగారు. " ఓఎస్‌సీలు తాళం వేసి ఉన్నాయా, పనిచేయడం లేదా నిర్దేశించిన విధంగా 24 గంటలూ పనిచేయడంలో విఫలమవుతున్నాయా, విఫలమైతే వాటి వివరాలు తెలియజేయాలి. గత ఐదేళ్లలో రాష్ట్రాల వారీగా, సంవత్సరాల వారీగా ఒఎస్‌సిలలో సహాయం, ఆశ్రయం పొందిన మహిళల సంఖ్య, అలాగే నమోదైన కేసుల సంఖ్యను తెలపాలని కోరారు". ఈ ప్రశ్నకు మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి సావిత్రి ఠాకూర్ లిఖితపూర్వక సమాధానమిచ్చారు. "ఒఎస్‌సి అనేది 'మిషన్ శక్తి' కింద ఉన్న 'సంబల్' విభాగంలో ఒక భాగమని, ఇది ప్రైవేట్ మరియు పబ్లిక్ ప్రదేశాలలో హింసకు గురైన, ఇబ్బందుల్లో ఉన్న మహిళలకు సమగ్రమైన, తక్షణ మద్దతును అందిస్తుంది. ఇది అవసరమైన మహిళలకు వైద్య సహాయం, న్యాయ సహాయం, సలహా, తాత్కాలిక ఆశ్రయం, పోలీసు సహాయం,మానసిక-సామాజిక కౌన్సెలింగ్ వంటి సేవలను అందిస్తుంది. ఒఎస్‌సి ప్రారంభమైనప్పటి నుండి, అంటే 2015 ఏప్రిల్ 1 నుండి డిసెంబర్ 31 వరకు దేశంలో 13.37 లక్షలకు పైగా మహిళలు సహాయం పొందారు" అని ఆమె పేర్కొన్నారు.

## హార్ముజ్ జలసంధిని దాటిన మరో భారత నౌక 'గ్రీన్ ఆశా'


**టెహ్రాన్: ఏప్రిల్ 5(డ్రీమ్ టైమ్స్):**



పశ్చిమాసియాలో కొనసాగుతున్న తీవ్ర ఉద్రిక్తల నడుమ మరో భారత జెండాతో ఉన్న ఎల్‌పిజి నౌక 'గ్రీన్ ఆశా' హార్ముజ్ జలసంధిని దాటింది. ఈ ప్రాంతంలో సంక్షోభం మొదలైనప్పటి నుంచి ఈ కీలక సముద్ర మార్గాన్ని దాటిన తొమ్మిదో భారత ట్యాంకర్ ఇదే కావడం గమనార్హం. ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ దాడుల అనంతరం హార్ముజ్ జలసంధిని మూసివేసిన సంగతి తెలిసిందే. ప్రపంచ ఇంధన సరఫరాలో అత్యంత కీలకమైన ఈ మార్గంలో భద్రతాపరమైన ఆందోళనలు పెరిగాయి. గ్రీన్ ఆశా కంటే ముందు బిడబ్ల్యూ టైర్, బిడబ్ల్యూ ఎల్మ్ అనే రెండు ఎల్‌పిజి నౌకలు సుమారు 94,000 టన్నుల కార్గోను రవాణా చేశాయి. మార్చి నెలలో ఎంటి శివాలిక్, ఎంటి నందా దేవి అనే ట్యాంకర్లు 92,700 టన్నుల ఎల్‌పిజిని గుజరాత్‌లోని ముంద్రా, కాండ్లా పోర్టులకు చేర్చాయి. ముడి చమురు, ఇతర ఇంధన నౌకలు కూడా ఈ మార్గంలో ప్రయాణించాయి. 'జగ్ లాడ్కి' అనే ఆయిల్ ట్యాంకర్ యుఎఇ నుండి 80,000 టన్నుల ముడి చమురును ముంద్రా పోర్టుకు తీసుకురాగా, 'జగ్ ప్రకాశ్' నౌక ఒమన్ నుంచి ఆఫ్రికా మార్కెట్లకు గ్యాసోలిన్‌ను చేరవేసింది.

## గల్లంతైన అమెరికన్ పైలట్ ను కాపాడిన భద్రతా దళాలు


**వాషింగ్టన్/టెహ్రాన్ ఏప్రిల్ 5(డ్రీమ్ టైమ్స్):**



ఇరాన్ గగనతలంలో కూలిపోయిన ఎఫ్-15ఈ (F-15E) యుద్ధ విమానానికి సంబంధించి గత 36 గంటలుగా కొనసాగుతున్న ఉత్కంఠకు ఎట్టకేలకు తెరపడింది. గల్లంతైన అమెరికన్ పైలట్ ఆచూకీ లభించడమే కాకుండా, అమెరికా భద్రతా దళాలు అతడిని రక్షించాయి. శుక్రవారం ఇరాన్ దళాలు జరిపిన దాడిలో అమెరికాకు చెందిన ఫైటర్ జెట్ కూలిపోయిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో విమానంలోని ఇద్దరు సిబ్బంది ఎజెక్ట్ అయ్యారు. ఒకరిని వెంటనే రక్షించినప్పటికీ, రెండో పైలట్ ఆచూకీ లభించలేదు. శత్రువుల కళ్లు గప్పి ఇరాన్ పర్వత ప్రాంతాల్లో దాక్కున్న ఆ పైలట్ కోసం అమెరికా సైన్యం డ్రోన్లు, హెలికాప్టర్లతో భారీ గాలింపు చేపట్టింది. మరోవైపు ఇరాన్ కూడా సదరు పైలట్‌ను పట్టుకునేందుకు ప్రయత్నించింది. అయితే, ఇరాన్ సేనల కంటే ముందే అమెరికా స్పెషల్ ఫోర్స్ కమెండోలు పైలట్ ఉన్న ప్రాంతాన్ని గుర్తించి అతడిని రక్షించాయి. ఈ ఆపరేషన్ విజయవంతం కావడంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంతోషం వ్యక్తం చేస్తూ, ఇది అమెరికా సైనిక చరిత్రలోనే అత్యంత సాహసోపేతమైన రెస్క్యూ ఆపరేషన్ అని కొనియాడారు. ప్రస్తుతం ఆ పైలట్ సురక్షితంగా ఉన్నారని, స్వల్ప గాయాల నుంచి కోలుకుంటున్నారని అధికారులు వెల్లడించారు.

## ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు

**ఏప్రిల్ 5(డ్రీమ్ టైమ్స్):**
బెంగళూరు నుంచి ఢిల్లీ బయల్దేరాల్సిన ఇండిగో విమానంలో శనివారం సాయంత్రం బాంబు బెదిరింపు కలకలం సృష్టించింది. విమానం టేకాఫ్ కానున్న సమయంలో వాష్‌రూమ్‌లో టిష్యూ పేపర్‌పై బాంబు బెదిరింపు నోట్ కనిపించింది. దీంతో ప్రయాణికులను



దింపివేసి, విమానాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఎలాంటి బాంబు లేదని తేలడంతో, ప్రయాణికులను తిరిగి విమానంలోకి ఎక్కించి ఢిల్లీకి పంపించారు. ఈ బెదిరింపు నోట్‌పై అధికారులు విచారణ జరుపుతున్నారు. ఇటీవల ఇలాంటి అనవసర బెదిరింపులకు పాల్పడిన మైసూరుకు చెందిన ఒక వ్యక్తిని ఢిల్లీ పోలీసులు అరెస్టు చేశారు.

## వరుసగా మూడో మ్యాచులో ఓడిన సీఎస్కే

- పాయింట్స్ టేబుల్‌లో అగ్రస్థానానికి చేరిన ఆర్సీబీ



**న్యూఢిల్లీ**
డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు.. ఐపీఎల్ 2026లో అదరగొడుతోంది. వరుసగా రెండో మ్యాచులో గెలిచింది. ఆదివారం బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన మ్యాచులో 43పరుగుల తేడాతో విజయం సాధించింది. దీంతో ఐపీఎల్ 2026 పాయింట్స్ టేబుల్‌లో అగ్రస్థానానికి చేరింది. ఓటముల హ్యాట్రిక్ నమోదు చేసిన చెన్నై సూపర్ కింగ్స్.. టేబుల్‌లో అట్టడుగు స్థానాన్ని పదిలం చేసుకుంది. ఇక ఈ మ్యాచ్ ఫలితంతో ఐపీఎల్‌లో ఆర్సీబీ వరుసగా నాలుగో మ్యాచులో సీఎస్కేను ఓడించింది.

## హొర్ముజ్‌ను తెరవండి.. లేదంటే!



మొదటి తరువాయి

### టెహ్రాన్‌పై అమెరికా భీకర దాడులు

ఇరాన్‌పై ఆదివారం అమెరికా భీకర దాడులు జరిపింది. ఈ దాడుల్లో ఇరాన్‌కు చెందిన కీలక మిలిటరీ నాయకులు మరణించినట్టు ట్రంప్ స్వయంగా ప్రకటించారు. 'టెహ్రాన్‌పై భీకర దాడులు జరిగాయి. ఇరాన్‌ను అవివేకంగా నడిపించిన అనేక మంది మిలిటరీ నాయకులు ఈ దాడుల్లో ప్రాణాలు కోల్పోయారు' అని ట్రూత్ సోషల్‌లో ఆయన రాసుకొచ్చారు. అయితే వారు ఎవరన్నది మాత్రం ఆయన వెల్లడించలేదు. దాడికి సంబంధించిన వీడియోలను కూడా ఆయన పోస్ట్ చేశారు. అయితే ట్రంప్ ప్రకటనపై ఇరాన్ స్పందించలేదు.

## పశ్చిమ బెంగాల్‌లో మహా జంగిల్ రాజ్ ప్రభుత్వం..

మొదటి తరువాయి

తలెత్తుకుని నిలబడగల ఆత్మవిశ్వాసాన్ని అందిస్తుంది. ఒకవైపు సిండికేట్ పాలనలో ఆస్తుల్ని కోల్పోతామనే భయం. ఇంకోవైపు తమ భూమిపై యాజమాన్య హక్కులు కల్పించగలదనే విశ్వాసం ఇవ్వగల పార్టీ" అంటూ బీజేపీ గురించి మోదీ చెప్పారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించడానికి తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని మోదీ తెలిపారు. అక్రమ చొరబాటుదారుల్ని రక్షించేందుకే మమతా బెనర్జీ ఆధ్వర్యంలోని ప్రభుత్వం 'సర్'ను అడ్డుకుంటోందని విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేయాలని, ఈ ఎన్నికలు పశ్చిమ బెంగాల్ భవిష్యత్‌ను నిర్ణయిస్తారన్నారు. ఎన్నికల రోజు టీఎంసీకి భయపడవద్దని మోదీ ప్రజలను కోరారు. ఈ ఎన్నికలు బెంగాల్ ప్రజల్లోని భయాన్ని బయటకు తొలగిస్తాయని అభిప్రాయపడ్డారు. ఇటీవల జడ్జీలు, పౌరులు ఎలా ఇబ్బంది పడ్డారో ప్రజలు చూశారని మోదీ అన్నారు. బెంగాల్‌లో రెండు దశల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగబోతున్నాయి. ఏప్రిల్ 23, 29 తేదీల్లో ఈ ఎన్నికలు జరుగుతాయి.

## ఉప్పల్‌లో సన్‌రైజర్స్‌కు నిరాశ..

**-బోణీ కొట్టిన పంత్ టీమ్..!**
**-సన్ రైజర్స్‌పై లక్నో సూపర్ జెయింట్స్ విజయం**
**-ఉప్పల్‌లో జరిగిన మ్యాచ్‌లో 5 వికెట్ల తేడాతో విక్టరీ**
**-అజేయ హాఫ్ సెంచరీతో జట్టును గెలిపించిన పంత్**



**న్యూఢిల్లీ**
ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2025లో రిషభ్ పంత్ సారథ్యంలోని లక్నో సూపర్ జెయింట్స్ బోణీ కొట్టింది. ఆదివారం సన్ రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచులో 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. 157 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన లక్నో సూపర్ జెయింట్స్‌ను కెప్టెన్ రిషభ్ పంత్ ఆదుకున్నాడు. అజేయ హాఫ్ సెంచరీతో మరో బంతి మిగిలి ఉండగానే జట్టును గెలిపించాడు. ఈ ఓటమితో సన్ రైజర్స్ మూడు మ్యాచులలో రెండో ఓటమిని చవిచూసింది. 157 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన లక్నో సూపర్ జెయింట్స్‌కు ఓపెనర్లు ఎయిడెన్ మార్‌క్రమ్ (45), మిచెల్ మార్ష్ (14) మంచి ఆరంభాన్ని ఇచ్చారు. తొలి వికెట్‌కు 37 పరుగులు జోడించారు. గత మ్యాచులో ఓపెనర్‌గా వచ్చిన రిషభ్ పంత్ ఈ మ్యాచులో వన్ డౌన్‌లో బ్యాటింగ్‌కు దిగాడు. సాధించాల్సిన స్కోరు పెద్దగా లేకపోవడంతో ఆచీతూచీ బ్యాటింగ్ చేశాడు. భారీ షాట్లకు పోకుండా.. సమయోచితంగా జట్టును నడిపించాడు. అయితే చివర్లో ఆయుశ్ బదోనీ (12), నికోలస్ పూరన్ (1), అబ్దుల్ సమద్ (16) త్వరగా ఔట్ కావడంతో మ్యాచ్ ఆసక్తికరంగా మారింది. చివరి ఓవర్‌లో లక్నో విజయానికి 9 పరుగులు అవసరం అయ్యాయి. తొలి రెండు బంతులను బౌండరీకి తరలించిన పంత్.. మ్యాచ్‌ను సన్ రైజర్స్‌కు దూరం చేశాడు. ఐదో బంతికి మరో సింగిల్ తీసి.. మ్యాచ్ ముగించాడు. 50 బంతుల్లో 68 రన్స్ చేసి అజేయంగా నిలిచాడు. ఒంటి చేత్తో జట్టును గెలిపించాడు. ఈ విజయంతో లక్నో.. ఐపీఎల్ 2025 పాయింట్స్ టేబుల్‌లో బోణీ కొట్టింది. అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన సన్ రైజర్స్ హైదరాబాద్.. నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 156 పరుగులు చేసింది. ఓ దశలో సన్ రైజర్స్.. 26 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయింది. ఈ సమయంలో హెన్రిచ్ క్లాసెన్ (41 బంతుల్లో 62 రన్స్), నితీశ్ కుమార్ రెడ్డి (33 బంతుల్లో 56 రన్స్) చేయడంతో కోలుకుని.. పోరాడే లక్ష్యాన్ని నిర్దేశించింది.

# గ్రామ సమూహ ఐక్యత.. బయనపల్లి శ్రీరాముడి ఘనత

మొదటి తరువాయి

### దేశ విదేశాల నుంచి స్వగ్రామం వైపు అడుగులు

బతుకుదెరువు కోసం దేశ విదేశాల్లో స్థిరపడిన రైతులు, ఉద్యోగులు, సాఫ్ట్వేర్ ఇంజనీర్లు...
ఎంత దూరంలో ఉన్నా ఈ ఒక రోజు మాత్రం తమ ఊరికి చేరుకుంటారు.
తీరిన మొక్కులు, నెరవేరిన కోరికల గుర్తుగా శ్రీరాముడికి విరాళాలు సమర్పించడం ఆనవాయితీ.
ఈ భక్తి, అనుబంధమే ఈ ఉత్సవాన్ని కోట్ల రూపాయల స్థాయికి తీసుకెళ్లింది.
అన్నదానంలో అపారమైన సేవాభావం
మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు నిరంతరాయంగా వేలాది మందికి అన్నదానం జరుగుతుంది.
ఇక్కడ ఎవరు పెద్దవారు, చిన్నవారు అనే తేడా లేదు...
సేవే పరమోన్నతి అన్న భావనతో
ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతను నిర్వర్తిస్తారు.
బాణాసంచా విన్యాసం... కళ్లకు విందు
నెల్లూరు జిల్లా గూడూరు సమీపంలోని చిలకూరు నుంచి
ప్రత్యేక నిపుణులు పది రోజుల ముందే వచ్చి
బయనపల్లిలోనే బాణాసంచా తయారు చేస్తారు.
రూ.50 లక్షలకు పైగా వ్యయంతో సిద్ధమయ్యే ఈ విన్యాసం
గంటసేపు సాగుతూ ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తుంది.



ఆ వెలుగులు, శబ్దాలు, రంగుల సమ్మేళనం
చూసినవారికి జీవితాంతం మర్చిపోలేని అనుభవం.
చరిత్ర చెబుతున్న విశిష్టత.


శ్రీకృష్ణదేవరాయల కాలం నాటి
సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వాముల విగ్రహాలు
ఇక్కడ ఉండటం ఈ క్షేత్రానికి మరింత ప్రాముఖ్యతను తెచ్చింది.
వాటి విలువే కాదు...
వాటి వెనుక ఉన్న చరిత్రే ఈ ఉత్సవానికి ప్రాణం.
ఐక్యతకు నిలువెత్తు ఉదాహరణ
హిందూ, ముస్లిం, క్రైస్తవ మతాలకు చెందినవారు
సమానంగా పాల్గొనడం ఈ ఉత్సవానికి ప్రత్యేకత.
ఇక్కడ
కులం లేదు...
మతం లేదు...
ఉన్నది ఒక్కటే --- సామూహిక ఐక్యత.
మారుతున్న కాలానికి సందేశం
విభజనలు పెరుగుతున్న ఈ కాలంలో
బయనపల్లి చూపిస్తున్న మార్గం
ప్రతి గ్రామం అనుసరించాల్సిన ఆదర్శం.
ఐక్యత ఉంటేనే అభివృద్ధి...
సామూహికత ఉంటేనే సంస్కృతి నిలుస్తుందనే సందేశం
ఈ ఉత్సవం గట్టిగా వినిపిస్తోంది.

# జలమే జీవం

మొదటి తరువాయి

ఈ కార్యక్రమాన్ని చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా సాగునీటి సంఘాలకు సీఎం పలు సూచనలు చేశారు. సోమవారం నుంచి ఈ నెల 15వ తేదీ దాకా సాగునీటి భద్రతా కార్యక్రమాలను గుర్తించాలన్నారు. గుర్తించిన పనులకు16 నుంచి 20వ తేదీ వరకు పాలనామోదం పొందాలన్నారు. 21 నుంచి జూలై 9వ తేదీ దాకా పనులు చేపట్టాలని ఆదేశించారు. జూలై 10 నుంచి 14వ తేదీ దాకా పనుల వివరాలతో కూడిన నివేదికను సమర్పించాలని సూచించారు. ఈ వంద రోజుల కార్యక్రమం అనంతరం వర్షాకాలం ప్రారంభమవుతుందని వివరించారు. ప్రస్తుతం రిజర్వాయర్లలో గతంలో కంటే నీళ్లు పుష్కలంగా ఉన్నాయని, భూగర్భ జలాలు పెరిగాయని వెల్లడించారు. నీటి భద్రత ఇవ్వగలిగితే రాష్ట్రమంతా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు.

**సమర్థంగా నీటి యాజమాన్య నిర్వహణ**
తాగు, సాగు, పారిశ్రామిక అవసరాలకు నీళ్లు అందించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని సాగునీటి సంఘాలకు సీఎం చంద్రబాబు సూచించారు. వేసవికి ముందు ఆరు మీటర్ల లోతులో, వర్షాకాలం తర్వాత మూడు మీటర్ల లోతులోనే జలాలు అందుబాటులో ఉండేలా కార్యాచరణను అమలు చేయాలని స్పష్టం చేశారు. మైక్రో ఇరిగేషన్‌ను అమలు చేయాలని, ప్రతి చుక్కనూ సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 7, 8 మీటర్ల లోతున భూగర్భ జలాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. ఈ మట్టాన్ని ఒకటిన్నర మీటర్ల లోతులోనే అందుబాబులో ఉండేలా కార్యాచరణ



అమలు చేయాలని సూచించారు. జలధార పేరుతో అన్నమయ్య జిల్లాలో అమలు చేస్తున్న నీటి సంరక్షణ చర్యలను సీఎం చంద్రబాబు అభినందించారు. భూగర్భ జలాలను పెద్దఎత్తున పెంపొందించారంటూ అధికారులను ప్రశంసించారు. ఫీడర్ చానళ్లను క్లియర్ చేయాలని, పూడికతీత పనులు చేపట్టాలని సూచించారు. అప్పుడే ఎక్కువ నీటిని సంరక్షించుకోగలమన్నారు. చెక్‌డ్యామ్‌లను అవసరమైన మేర మరమ్మతులు చేసుకోవాలన్నారు. సాగునీటి సంఘాలు వాటర్ బడ్జెట్ తయారు చేసుకోవాలని సూచించారు. సాగునీటి సంఘాల పరిధిలో నీటి లభ్యతను గుర్తించాలన్నారు. కొద్దిపాటి శ్రద్ధ పెడితే లక్ష్యాలను చేరుకోవడం సాధ్యమేనని, ప్రజల భాగస్వామ్యంతో వందరోజుల నీటి సంరక్షణ ఉద్యమం జరగాలని సూచించారు. రాష్ట్రంలో పెండింగ్ ప్రాజెక్టులను ప్రాధాన్యక్రమంలో చేపడుతున్నామని చెప్పారు. హంద్రీ-నీవా, గాలేరు-నగరి, తెలుగుగంగ వంటి ప్రాజెక్టులకు ఎన్టీఆర్ హయాంలో శ్రీకారం చుట్టామని గుర్తు చేశారు. ఇప్పుడు పోలవరం సహా పలు ప్రాజెక్టులను పూర్తి చేస్తున్నామన్నారు. ప్రతి ఎకరాకూ సాగునీటిని ఇవ్వాలన్న సంకల్పంతో ఉన్నామన్నారు. వర్షపు నీటిని సంరక్షిస్తున్నామని, 2024 మే నుంచి 2025 మే వరకూ 2.20 మీటర్ల మేర భూగర్భ జలాలు పెరిగాయని వివరించారు.

**నేడు యాడికిలో చంద్రబాబు పర్యటన**
సోమవారం అనంతపురం జిల్లా తాడిపత్రి నియోజకవర్గం యాడికిలో జరిగే కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొంటారు. అక్కడ సాగునీటి వినియోగదారుల సంఘాలు, రైతులతో సమావేశమవుతారు. హంద్రీ-నీవా కాలువ ద్వారా ప్రయోజనం పొందుతున్న రైతులతో మాటామంతీ నిర్వహిస్తారు. పంట కాలువ విస్తరణ ద్వారా ఆయకట్టుకు అందిస్తున్న జలాలు, సాగునీటి ప్రాంతాల్లో నీటి లభ్యత తదితర అంశాలపై మాట్లాడుతారు. సమర్థ నీటి యాజమాన్య నిర్వహణతో రాష్ట్రవ్యాప్తంగా సాధించిన నీటి భద్రత, రిజర్వాయర్లలో నీటి నిల్వలు, భూగర్భ జలాల మట్టాల పెరుగుదల వంటి అంశాలపై సీఎం మాట్లాడుతారు.


# దద్దరిల్లిన గల్ఫ్..

మొదటి తరువాయి

ఈ విషయాన్ని ఆ దేశ విద్యుత్ మంత్రిత్వ శాఖ ఆదివారం వెల్లడించింది. ఈ దాడులతో ఆ ప్లాంట్లకు భారీగా నష్టం ఏర్పడిందని, దీంతో రెండు విద్యుత్తు ఉత్పత్తి యూనిట్లను మూసివేశామని, అయితే ఇందులో ఎవరూ మరణించడం కానీ, గాయపడటం కానీ జరగలేదని తెలిపారు. కువైట్‌లోని ప్రభుత్వ కాంప్లెక్స్‌పై కూడా ఆదివారం డ్రోన్ దాడి జరిగింది. ఈ కాంప్లెక్స్ చమురు మంత్రిత్వ శాఖ, కువైట్ పెట్రోలియం కార్పొరేషన్ ప్రధాన కార్యాలయం ఉన్నట్టు స్థానిక మీడియా తెలిపింది. దాడుల నేపథ్యంలో సిబ్బందిని ఇంటి వద్ద నుంచే విధులు నిర్వహించాలని ఆదేశించామని అధికారులు తెలిపారు. తమ దేశంలోకి దూసుకొస్తున్న క్షిపణులు, డ్రోన్లను చాలావరకు నిరోధించినట్టు కువైట్ మిలిటరీ ప్రకటించింది. అధికారులు జారీ చేసే భద్రతా మార్గదర్శకాలను పౌరులు తప్పనిసరిగా పాటించాలని కోరింది. డ్రోన్ దాడిలో తమ షువైక్ చమురు క్షేత్రం మంటల్లో చిక్కుకుందని కువైట్ పెట్రోలియం కార్పొరేషన్ తెలిపింది. మంటలను అత్యవసర బృందాలు అదుపు చేస్తున్నాయని, జరిగిన నష్టాన్ని అంచనా వేస్తున్నట్టు కువైట్ న్యూస్ ఏజెన్సీ వెల్లడించింది. శుక్రవారం మినియా అల్ అహ్మదీ చమురు శుద్ధి కర్మాగారంపై దాడి తర్వాత ఇరాన్ తన దాడులను కొనసాగిస్తూనే ఉందని పేర్కొన్నది.

### బహ్రెయిన్‌లో బాప్కో ఎనర్జీస్‌పై దాడి

బహ్రెయిన్‌లోని అతిపెద్ద రిఫైనరీ అయిన బాప్కో



ఎనర్జీస్ నిర్వహిస్తున్న సదుపాయంలోని ఒక స్టోరేజ్ ట్యాంక్‌పై ఆదివారం ఇరాన్ క్షిపణితో దాడి జరిపింది. దాడిలో ఆ ప్రదేశంలో భారీగా ఎగసిపడుతున్న మంటలు, నల్లటి పొగతో నిండిన వీడియోను ఇరాన్ ప్రభుత్వ మీడియా ప్రసారం చేసింది. 10 సెకన్ల ఈ క్లిప్‌లో తొలుత అక్కడ భారీ పేలుడు సంభవించి ఆ ప్రదేశం అగ్నిగోళంగా మారిపోయింది. ఆ తర్వాత భారీగా ఎగసిపడ్డ మంటలు, నల్లటి పొగ కన్పించాయి. కాగా, దాడి ప్రమాదాన్ని పసిగట్టి సైరన్‌లు మోగించి పౌరులను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్టు బహ్రెయిన్ ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. గత నెలలో కూడా ఇరాన్ ఈ ప్రదేశంపై దాడి చేసినట్టు అధికారులు తెలిపారు. గత 24 గంటల్లో తమపై 13 డ్రోన్లతో దాడి జరిగినట్టు బహ్రెయిన్ వెల్లడించింది.

### అమెరికా ఎంబసీకి భారీగానే నష్టం

రియాద్‌లోని యూఎస్ ఎంబసీపై ఇరాన్ గత నెలలో చేసిన డ్రోన్ దాడిలో గతంలో పేర్కొన్న దానికన్నా భారీగానే నష్టం జరిగిందని అమెరికా మాజీ అధికారులను ఉటంకిస్తూ వాల్ స్ట్రీట్ జర్నల్ (డబ్ల్యూఎస్‌జే) తెలిపింది. ఈ దాడి లో ఇరాన్ రాయబారి క్వార్టర్స్‌తో పాటు కార్యాలయం కూడా పూర్తిగా ధ్వంసం అయింది. మూడంతస్తుల భవనం తీవ్రంగా దెబ్బతింది. మరోవైపు, ఇరాక్‌లోని అమెరికా దౌత్య కార్యాలయాలపై ఇరాన్ మద్దతు గ్రూపులు దాడులు చేసినట్టు అమెరికా ఎంబసీ తెలిపింది.

# సంపాదకీయం

## గ్రామాల అభివృద్ధికి దృష్టి సారించాలి !




రైజింగ్ తెలంగాణ, ట్రీ మిలియన్ ఎకానమీ...ఇవన్నీ వినడానికి బాగానే ఉన్నా..ఆచరణలో పట్టుదల ముఖ్యం. ఎపిలో స్వర్ణగ్రామం, స్వర్ వార్డులు అంటూ కొత్త పేర్లతో ఊదరగొడుతున్నారు. గ్రామాలు లేకుండా అభివృద్ధి సాధ్యం కాదు. ఎంతసేపు పల్లెలను విస్మరించి, పట్టణాలకే పెద్దపీట వేయడం సరికాదు. గ్రామాల అవసరాలను గుర్తించడంలో ప్రభుత్వాలు విఫలం అవుతున్నాయి. నిరంతరంగా ప్రభుత్వంపై ఆధారపడే దుస్థితి నుంచి తప్పించాలి. ఫ్యూచర్ సిటీ, దేశ పురోభివృద్ధి, ఆర్థికంగా బలోపేతంలో పదిశాతం భాగస్వామ్యం అవుతామంటున్న సిఎం రేవంత్ రెడ్డి, గ్రామాలను విస్మరిస్తే అనుకున్న ఫలితాలను సాధించలేరు. గ్రామాలను బలోపేతం చేస్తే పట్టణాలపై ఒత్తిడి తగ్గగలదు. గ్రామాల్లో విద్య,వైద్యం, పారిశుధ్యం, పచ్చదనం వంటివన్నీ ప్రధాన సమస్యలుగా ఉన్నాయి. గత రెండేళ్లుగా గ్రామాలు కునారిల్లాయి. కనీస వసతులు లేవు. గ్రామాల్లో అత్యధిక శాతం అధికార కాంగ్రెస్ ఆధిపత్యంలోనే ఉన్నాయి. రాజకీయాలకు అతీతంగా గ్రామాల అభివృద్ధి విషయంలో అంతా కలసి రావాలి. గ్రామాలను బలోపేతం చేస్తేనే, గ్రామాల ఆర్థిక వ్యవస్థలు బలపడితేనే రాష్ట్రం, తద్వారా దేశం అభివృద్ధి చెందగలదు. అందువల్ల ఇప్పటి నుంచే గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు రచించాలి. గ్రామాలను ఆర్థికంగా బలోపేతం చేసే విధంగా ఆలోచన చేయాలి. గ్రామాల్లో ప్రస్తుతం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలన్నీ పరిష్కరించలేనివేమీ కాదు. అందువల్ల వెంటనే ఇందుకు కార్యాచరణ చేయాలి. సాగునీరు, తాగునీరు, విద్యుత్ సరఫరా, పారిశుధ్యం వట్టి సమస్యలపై ఇరు రాష్ట్రాల సిఎంలు శ్రమించాలి. ఉచిత పథకాలు పెరిగినా కొద్దీ గ్రామాల్లో కూలీల కొరత ఏర్పడుతోంది. పనిచేసే కూలీలు దొరక్క రైతులు నానా అగచాట్లు పడుతున్నారు. అన్నీ ప్రభుత్వం చేస్తుందనే ధోరణి నుంచి ప్రజలు బయపటడేలా చేయాలి. నా గ్రామాన్ని నేనే కాపాడుకోవాలన్న నినాదంతో ముందుకు సాగాలి. సర్పంచ్‌లను అందుకు భాగస్వాములను చేయాలి. అనవసర పథకాలకు వేలకోట్లు తగలేసే బదులు గ్రామాలను అభివృద్ధి చేసే కార్యాచరణకు నిధులు వెచ్చించాలి. ప్రభుత్వంపై ఆశతో ప్రజలు ఉన్నారని గుర్తించాలి. ఏదో చేస్తారన్న నమ్మకం ఉంది. ఇందిరమ్మ ఇళ్లు కావచ్చు, ఇతర అభివృద్ధికావచ్చు గ్రమాలను దృష్టిలో పెట్టుకుని ముందుకు సాగాలి. ప్రపంచ చిత్రపటంలో తెలంగాణను ముందువరసలో నిలబెడతామంటున్న ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్ రెడ్డిలు గ్రామాలను విస్మరిస్తే ముందుకు సాగలేరు. ప్రధానంగా తాగునీటి సమస్య, వైద్యరంగాలను, విద్యారంగాన్ని బలోపేతం చేయాలి. గ్రామాలను ఆర్థికంగా బలోపేతం చేసేలా కార్యచరణ ఉంటే నిరుద్యోగిత కూడా తగ్గుతుంది. వ్యయసాయాధిరత చిన్న పరిశ్రమలకు ఊతం ఇచ్చే చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రపంచంలో తెలంగాణకు ముఖ్యంగా రాజధాని హైదరాబాద్‌కు అత్యధిక ప్రాధాన్యతను కలిగి ఉన్నది. చారిత్రకంగా, భౌగోళికంగా,ఆర్థికంగా దేశ అభివృద్ధిలో తెలంగాణ అత్యంత కీలక పాత్రను పోషిస్తున్నది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ అబివృద్ధి ఆధునిక, హైటెక్ రాజధానిగా అభివృద్ధి చెందింది. దేశంలో ప్రధాన మెట్రో సిటీలుగా ప్రసిద్ధి చెందిన ఢిల్లీ, చెన్నై, ముంబయ్, కలకత్తాల కంటే అనువైన వాతావరణ పరిస్థితులు హైదరాబాద్‌లో ఉన్నాయి. హైదరాబాద్ చుట్టూ తెలంగాన అభివృద్ధి చెందడానికి అనువైన వాతావరణం ఉంది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి చేస్తే రాజధానులపై ఒత్తిడి తగ్గుతంది. ప్రధానంగా వ్యవసాయాధారిత పరిశ్రమలతో యువతను గ్రామాలకు మళ్లించాలి. దాంతో ఆర్థికంగా ఎదుగుదలతో పాటు గ్రామాలు పురోగమిస్తాయి. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో ఉజ్వల తెలంగాణ నిర్మాణానికి పూనుకుంటే అది దేశానికి ఆదర్శంగా నిలుస్తుంది. 2047 నాటి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా నిర్మించటం విజన్ డాక్యుమెంట్ లక్ష్యం కనుక, మనం వ్యవసాయరంగంలో అగ్రభాగాన ఉన్నాం కనుక వ్యవసాయోత్పత్తులు, అనుబంధ రంగాలను బలోపేతం చేసుకుంటూ పోతే, ఆర్థికంగా ఎదగడానికి దోహదపడగలదు. దీనికోసం ప్రధానంగా సేవలు, పారిశ్రామిక రంగంపై దృష్టి కేంద్రీకరించాలి. మద్దతుగా వ్యవసాయ రంగాన్ని ఆధునీకరించాలి. గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని అభివృద్ధికి దోహదపడేలా చేయాలి. అప్పుడే తెలంగాన కల సాకారం కాగలదు. గతంలో లాగా చెట్టుపేరు చెప్పి కాయలు అమ్ముకునే దుస్థితి రాకుండా చూసుకోవాలి. వ్యవసాయ పంటల కొనుగోళ్లను సజావుగా సాగేలా చూడాలి. పంటల విధానంలో మార్పులు రావాలి. ఇవన్నీ జరిగితేనే అనుకున్న అభివృద్ధి సాధ్యం కాగలదు.

# పోరు ద్విముఖం.. విజయం మా పక్షం

**-హక్కులతో రాజీపడటమంటే బానిసత్వమే**
**-- ది హిందూ ఇంటర్వ్యూలో తమిళనాడు సిఎం స్టాలిన్**



**చెన్నరు న్యూఢిల్లీ: ఏప్రిల్ 5(డ్రీమ్ టైమ్స్):** : తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో బహుముఖ పోరు ఉంటుందని, పోరు హోరాహోరీ జరుగుతుందనే అంచనాలను రాష్ట్ర ముఖ్యమంత్రి, డిఎంకె అధ్యక్షులు ఎంకె స్టాలిన్ తోసిపుచ్చారు. ఎన్నికల్లో పోరు రెండు పార్టీలు డిఎంకె, అన్నాడిఎంకె మధ్యే ఉంటుందన్నారు. డిఎంకె నేతృత్వంలోని సెక్యూలర్ ప్రోగ్రెసివ్ అలయన్స్ (ఎస్పిఎ) విజయం సాధిస్తుందని స్పష్టం చేశారు. 'మమ్మల్ని సవాల్ చేసేందుకు ఇతర పార్టీలకు సంస్థాగత బలం, మౌలిక సదుపాయాలు లేవు' అని స్టాలిన్ తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో తొలిసారి 'ది హిందూ' వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో అనేక అంశాలపై ఆయన మాట్లాడారు. ముదరై, విరుదునగర్ జిల్లాల్లో ఆదివారం జరిగిన ఎన్నికల ప్రచార సభల్లో ఆయన ప్రసంగించారు. ఈ మధ్యలోనే ఇంటర్వ్యూ ఇచ్చారు. డిఎంకె ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలకు, ఇటీవల విడుదల చేసి ఎన్నికల మేనిఫెస్టోకు ప్రజల నుంచి భారీ స్థాయిలో ప్రశంసలు వస్తున్నాయని స్టాలిన్ తెలిపారు. ముఖ్యంగా గృహోపకరణాలు కొనుగోలు లేదా ఎక్స్ఛేంజ్ కోసం రూ. 8 వేలు విలువైన కూపన్లు పంపిణీ చేసే 'ఇల్లతరసి' పథకం సూపర్‌స్టార్‌గా నిలిచిందని, ఈ ఎన్నికల్లో తాము సునాయాసంగా గెలుస్తామని స్టాలిన్ పేర్కొన్నారు. టివికె అధ్యక్షులు, నటుడు విజరు డిఎంకెపై చేస్తున్న ఆరోపణలపై స్పందించడం లేదన్న ప్రశ్నకు స్టాలిన్ బదులిస్తూ..తాము ఎవ్వరినీ వ్యక్తిగత శత్రువుగా చూడటం లేదన్నారు. తమ గమ్యం నుంచి దృష్టిని మళ్లించుకోవాలనుకోవడం లేదని ఆయన అన్నారు. రాష్ట్రాల హక్కులను వదులుకుని కేంద్ర ప్రభుత్వంతో సర్దుకుపోవడం అనేది ప్రజాస్వామ్య సూత్రాలకు విరుద్ధమని స్టాలిన్ అన్నారు. 'రాష్ట్ర హక్కులతో రాజీపడి కేంద్రంతో సర్దుకుపోతే తమిళనాడుకు బిజెపి మేలు చేస్తుందని మీరు అనుకోవడం ఆశ్చర్యంగా ఉంది. దీని వలన ఎలాంటి మేలు జరగదు. బదులుగా మరింత హాని చేస్తుంది. ఇది బానిసత్వమే' అని స్టాలిన్ తెలిపారు. గతంలో పళనిస్వామి నేతృత్వంలోని అన్నాడిఎంకె ప్రభుత్వం కేంద్రంలోని బిజెపి సర్కార్‌తో సర్దుబాట్లు చేసుకున్నా తమిళనాడుకు ఎలాంటి ప్రయోజనమూ కలగలేదని స్టాలిన్ గుర్తు చేశారు.

# ఆ విధ్వంసక క్షిపణులన్నీ ఇరాన్‌పైకే!



**వాషింగ్టన్ ఏప్రిల్ 5(డ్రీమ్ టైమ్స్):**
అమెరికా తన విధ్వంసక 'జేఏఎస్ఎస్ఎం-ఈఆర్' క్షిపణులను ప్రపంచవ్యాప్తంగా ఉన్న స్థావరాల నుంచి ఇరాన్ వైపు తరలిస్తున్నది. యుద్ధం మొదలు గాక ముందు క్షిపణి నిల్వలు 2,300 ఉండగా, దీంట్లో 1,000 క్షిపణుల్ని యుద్ధంలో మొదటి నాలుగు వారాల్లోనే అమెరికా వాడేసింది. మిగిలిన యూనిట్లను కూడా గల్ఫ్‌లోని సైనిక స్థావరాలకు అమెరికా తరలిస్తున్నది. శత్రుదేశం గగనతల రక్షణ వ్యవస్థలను తప్పించుకుంటూ 600 మైళ్లకుపైగా (సుమారుగా 965 కిలోమీటర్లు) దూరంలోని లక్ష్యాలను ఛేదించటం దీని ప్రత్యేకత. యుద్ధం తీవ్రమవుతున్న కొద్దీ, అమెరికాకు వీటి అవసరం పెరుగుతున్నది. ఈ క్షిపణుల మొత్తం నిల్వలన్నీ ఇరాన్‌పై వాడేందుకు అమెరికా యోచిస్తున్నదని బ్లూమ్‌బర్గ్ నివేదిక తెలిపింది.

# మాకివ్వాల్సిన ఆయుధాలు ఇజ్రాయెల్‌కు!..

**ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఆవేదన**




**కీవ్, ఏప్రిల్ 5(డ్రీమ్ టైమ్స్):**
పశ్చిమాసియా యుద్ధం కారణంగా అమెరికా తమకు ఇవ్వాల్సిన సైనిక, ఆయుధ సరఫరాను తగ్గించి ఇజ్రాయెల్‌కు తరలిస్తున్నదని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ యుద్ధమిలాగే కొనసాగితే అగ్రరాజ్యం నుంచి తమకు వస్తున్న మద్దతు భవిష్యత్‌లో తగ్గే అవకాశం ఉందని అన్నారు. రష్యా ఉపయోగిస్తున్న బాలిస్టిక్ క్షిపణులను అడ్డుకోవడానికి తాము అమెరికా సరఫరా చేసే పేట్రియాట్ వైమానిక రక్షణ వ్యవస్థలను ఉపయోగించినట్టు చెప్పారు. అయితే వాటి సరఫరా ఆగిపోవడంతో యుద్ధంలో తీవ్రంగా నష్టపోతున్నట్టు ఆవేదన వ్యక్తం చేశారు. తమ ఆయుధ నిల్వలు రోజురోజుకూ తగ్గిపోతున్నాయని ఆయన చెప్పారు. యుద్ధం ప్రభావం కారణంగా మిత్రదేశాల నుంచి కూడా తమకు ఎటువంటి సహాయం అందడం లేదని ఆయన అన్నారు. ఇదే అదనుగా రష్యా తమపై దాడులను తీవ్రం చేస్తున్నదని ఆయన వాపోయారు

# కర్ణాటకలో ట్రెక్కింగ్ చేస్తూ తప్పిపోయిన కేరళ యువతి..

**నాలుగు రోజులైనా దొరకని ఆచూకీ**





**న్యూఢిల్లీ: ఏప్రిల్ 5(డ్రీమ్ టైమ్స్):**
కేరళ నుంచి వచ్చిన ఒక పర్యాటకురాలు కర్ణాటకలో ట్రెక్కింగ్ చేస్తూ తప్పిపోయింది. నాలుగు రోజులైనా ఆచూకీ దొరకలేదు. దీంతో ఆమె కోసం కర్ణాటక ప్రభుత్వం గాలింపు చర్యలు చేపట్టింది. కేరళకు చెందిన జీఎస్ శరణ్య అనే 36 ఏళ్ల ఐటీ ప్రొఫెషనల్ కర్ణాటకకు సోలో ట్రిప్ కోసం వచ్చింది. కర్ణాటకలోని కొడుగు జిల్లాలోని కక్కాబే అనే గ్రామంలో ఉన్న ఒక ప్రైవేటు హోం స్టేలో ఉంది. ఆ తర్వాత ఏప్రిల్ 2న తడియాండమోల్ అనే అటవీ ప్రాంతానికి ట్రెక్కింగ్ కోసం వెళ్లింది. ఈ సందర్భంగా అక్కడ అటవీ అధికారుల వద్ద రిజిష్టర్ చేసుకుంది. ఈ ప్రాంతంలో ఏనుగులు ఎక్కువగా ఉంటాయని, సాయంత్రంకల్లా తిరిగి రావాలని అధికారులు ఆమెకు సూచించారు. మరో 10 మంది బృందంతో కలిసి వెళ్లి తిరిగి రావాలని కోరారు. ఈ సందర్భంగా ఆమె పేరు, వివరాలు నమోదు చేసుకుని అనుమతించారు. సాయంత్రం ఆమె మినహా అందరూ తిరిగొచ్చారు. దీంతో శరణ్య మిస్ అయినట్లు గుర్తించారు. దీంతో వెంటనే స్థానిక పోలీసులు, అటవీ అధికారులు గాలింపు చర్యలు ప్రారంభించారు. పోలీసులు, అటవీ అధికారులు, యాంటీ నక్సల్స్ ఫోర్స్ కూడా ఈ ఆపరేషన్‌లో పాల్గొంటున్నాయి. ఆమెను వెతికేందుకు డ్రోన్లు కూడా వాడుతున్నారు. నాలుగు రోజులైనా శరణ్య ఆచూకీ దొరకలేదు. ఈ అంశంపై కేరళ సీఎం పినరయి విజయన్.. కర్ణాటక సీఎం సిద్ధరామయ్యకు లేఖ రాశారు. వ్యక్తిగతంగా పర్యవేక్షించి, శరణ్యను గుర్తించాలని లేఖలో కోరారు. దీంతో సిద్ధరామయ్య కర్ణాటక అటవీ శాఖ మంత్రి ఈశ్వర్ ఖండ్రేకు ఆదేశాలు జారీ చేశారు. శరణ్యను వెతకాల్సిందిగా సూచించారు. దీనిపై స్పందించిన మంత్రి ఈశ్వర్ ఇందుకోసం ప్రత్యేక బృందాల్ని నియమించినట్లు తెలిపారు. డ్రోన్లు, అదనపు సిబ్బందితో గాలింపు చర్యలు చేపట్టినట్లు వివరించారు. మరోవైపు శరణ్య తప్పిపోవడంపై ఒక ప్రచారం జరుగుతోంది. శరణ్య, అడవిలోకి ఒంటరిగా వెళ్లిందని ప్రచారం మొదలైంది. కానీ, దీన్ని అక్కడి అటవీ అధికారులు ఖండించారు. తాము శరణ్యను ఇతర బృందంతో కలిసి వెళ్లాలని సూచించామని చెప్పారు. అలాగే, ఇతర బృంద సభ్యులకు మధ్యలో ఆమె కలిసినట్లు కూడా వెల్లడించారు. కానీ, తిరిగొచ్చే సమయంలోనే ఆమె మిస్సైందని పోలీసులు అంటున్నారు.

# ప్రభుత్వ మెడిసిన్ స్కామ్ బట్టబయలు..

**-రూ. 70 లక్షల విలువైన మందులు సీజ్**



**న్యూఢిల్లీ: ఏప్రిల్ 5(డ్రీమ్ టైమ్స్):**
ప్రభుత్వ ఆసుపత్రులలో ఉచితంగా పంపిణీ చేసే ప్రభుత్వ మందులను అక్రమంగా దారిమళ్లించి అమ్ముతున్న ముఠా గుట్టు రట్టయ్యింది. రూ. 70 లక్షల విలువైన మందులను పోలీసులు సీజ్ చేశారు. ఈ స్కామ్‌కు సంబంధించి ఐదుగురు నిందితులను అరెస్ట్ చేశారు. దేశ రాజధాని ఢిల్లీలో ఈ కుంభకోణం వెలుగులోకి వచ్చింది. ప్రభుత్వ ఆసుపత్రులకు సరఫరా చేసే కీలక మందులను ఒక ముఠా అక్రమంగా దారి మళ్లించి విక్రయిస్తున్నది. ఈ సమాచారం తెలుసుకున్న ఢిల్లీ పోలీసులు గురువారం ట్రాప్ వేశారు. తీస్ హజారీ ప్రాంతంలోని జై భారత్ ట్రాన్స్‌పోర్ట్ వద్ద రైడ్ చేశారు. రూ. 70 లక్షల విలువైన ప్రభుత్వ సరఫరా మందులతోపాటు తరలిస్తున్న వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. కాగా, భారీ మొత్తంలో మందులను తరలిస్తున్న ముగ్గురు నిందితులైన నీరేజ్ కుమార్, సుశీల్ కుమార్, లక్ష్మణ్ ముఖియాను పోలీసులు అరెస్టు చేశారు. వారిని ప్రశ్నించగా ఏడాదిన్నర కాలంగా ఒక ముఠా ఈ స్కామ్‌కు పాల్పడుతున్నట్లు తెలుసుకున్నారు. దీంతో రికార్డులను తారుమారు చేసి ప్రభుత్వ మందుల తరలింపునకు సహకరిస్తున్న దీన్ దయాళ్ ఉపాధ్యాయ ఆసుపత్రిలో ఫార్మసిస్ట్, స్టోర్‌కీపర్‌గా పనిచేస్తున్న బినేష్ కుమార్, కాంట్రాక్ట్ సహాయకుడు ప్రకాష్ మెహతోను కూడా పోలీసులు అరెస్ట్ చేశారు. మరోవైపు ఉత్తరప్రదేశ్‌లోని సహారన్‌పూర్‌కు చెందిన హోల్‌సేల్ మందుల వ్యాపారి నీరేజ్ ప్రధాన నిందితుడని పోలీస్ అధికారి తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల నుంచి మందుల సేకరణ, పంపిణీదారుడిగా అతడు వ్యవహరిస్తున్నట్లు చెప్పారు. ఆర్థిక లావాదేవీలు, ఈ నెట్‌వర్క్‌లోని ఇతర సభ్యులను గుర్తించేందుకు మరింతగా దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారి వెల్లడించారు.

డ్రీమ్ టైమ్స్
తెలుగు దిన పత్రిక
DREAM TIMES DAILY NEWS PAPER
సోమవారం
06-04-2026
Ananthapuram, Kurnool, Kadapa
అనంతపురం, కర్నూల్,కడప

# హెచ్‌పివి వ్యాక్సిన్ పోస్టర్ల విడుదల



**గుంతకల్లు, ఏప్రిల్ 5(డ్రీమ్ టైమ్స్):**
హెచ్ పి వి వ్యాక్సిన్ ప్రయోజనాన్ని తెలియజేస్తూ రూపొందించిన పోస్టర్లను అల్లు అర్జున్ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో ఆదివారం జనసేన పార్టీ గుంతకల్లు నియోజకవర్గ సమన్వయకర్త వాసగిరి మణికంఠ నివాసంలో అట్టహాసంగా విడుదల చేశారు. ఈ సందర్భంగా అల్లు అర్జున్ అభిమానులు గౌరవంగా వాసగిరి మణికంఠ కు మొక్కను బహుకరించి శాలువాతో సత్కరించారు. అనంతరం వాసగిరి మణికంఠ మాట్లాడుతూ...14 ఏళ్లు నిండిన బాలికలు హెచ్ పి వి వ్యాక్సిన్ తీసుకోవడం ద్వారా వారికి గర్భాశయ క్యాన్సర్ రాకుండా ఉంటుందని భావిభారత మహిళల కోసం ఉపయోగపడే ఇలాంటి మంచి కార్యక్రమానికి ప్రచారం కల్పిస్తున్న అల్లుఅర్జున్ కు, ఆయన అభిమానులకు ప్రత్యేక అభినందనలు తెలియచేశారు. మున్ముందు ఇలాంటి మంచి కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో అల్లుఅర్జున్ ఫాన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అనంతపురం జిల్లా ఉపాధ్యక్షుడు రవికుమార్, మ జిల్లా సెక్రెటరీ నాసిర్, అల్లు అర్జున్ అభిమాన సంఘం నాయకులు వెంకీ, హరీష్, మురళి, జాన్, భీమా, నిఖిల్, రూపేష్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాణ స్వీకారానికి హాజరైన గుమ్మనూరు నారాయణ



**ఆలూరు, ఏప్రిల్ 5(డ్రీమ్ టైమ్స్):**
కర్నూలు జిల్లా మంత్రాలయం నియోజకవర్గం ఉరుకున్న దేవస్థానం శ్రీ లక్ష్మీనరసింహస్వామి సేవా ట్రస్ట్ నూతన చైర్మన్ గా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పురుషోత్తం రెడ్డి ఆదివారం ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా ఆలూరు మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గుమ్మనూరు నారాయణ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో బిజెపి కార్యకర్తలు, గుమ్మనూరు నారాయణ అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఘనంగా బాబూ జగ్జీవన్ రామ్ 119 వ జయంతి..

చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన ఎమ్మెల్యే కేఈ.శ్యామ్ కుమార్




**పత్తికొండ ఏప్రిల్ 5(డ్రీమ్ టైమ్స్):**
బాబు జగ్జీవన్ రామ్ 119 వ జయంతి సందర్భంగా పత్తికొండ పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే కెఈ.శ్యాంబాబు ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ సమానత్వానికి ప్రతీకగా నిలిచిన బాబూ జగ్జీవన్ రామ్ జీవితం భారత ప్రజాస్వామ్య చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందని అన్నారు. అంటరానితనాన్ని ఎదురించి అట్టడుగు వర్గాల ఆత్మగౌరవానికి ఆయనే ఆశాకిరణం అయ్యారు అని అన్నారు.స్వాతంత్ర్య పోరాటం నుంచి సామాజిక న్యాయం వరకు ఆయన పోరాటం విశిష్టమైనదన్నారు. వ్యవసాయం,కార్మిక సంక్షేమం,జాతీయ ఆహార విధానాల్లో ఆయన ముద్ర అపారమైనది.ఆ మహనీయుని జయంతి సందర్భంగా ఆయన అడుగుజాడల్లో నడుద్దాం అన్నారు.ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సాంబశివరెడ్డి వెంకటపతి ప్రమోద్ రెడ్డి తలారి రంగప్ప మండల కన్వీనర్ సుధాకర్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ సేవలు చిరస్మరణీయం



గుంతకల్లులో వైసీపీ ఆధ్వర్యంలో జరిగిన దృశ్యం



గుంతకల్లులో సిపిఐ ఆధ్వర్యంలో జరిగిన దృశ్యం

### - గుంతకల్లులో ఆయన సేవలను కొనియాడిన వైసిపి, సిపిఐ

**గుంతకల్లు, ఏప్రిల్ 5(డ్రీమ్ ట్మ్స్):**
స్వాతంత్ర సమరయోధులు డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ సేవలు చిరస్మరణీయమని వైసిపి, సిపిఐ నేతలు కొనియాడారు. ఈమెరకు వారు ఆదివారం పట్టణంలోని ట్రావెలర్స్ బంగ్లా వద్ద ఉన్న జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైసీపీ నేతలు మాట్లాడుతూ
జగ్జీవన్ రాం స్వాతంత్ర్య సమర యోధులు.సంఘ సంస్కర్త. రాజకీయవేత్త. బీహార్ లోని వెనుకబడిన వర్గాలనుంచి వచ్చారు.1935లో అంటరాని వారికి సమానత్వం కోసం అంకితమైన ఆల్ ఇండియా డిప్రెస్డ్ క్లాసెస్ లీగ్ అనే సంస్థను స్థాపించడంలో ఆయన కీలక పాత్ర పోషించారన్నారు బాబూజీగా ప్రసిద్ధులు. భారత పార్లమెంటులో నలభై సంవత్సరాలకు పైగా వివిధ శాఖల క్యాబినెట్ మంత్రిగా పనిచేశాడు. 1971 ఇండో-పాక్ యుద్ధం జరిగిన సమయంలో భారత రక్షణ మంత్రిగా ఉన్నారన్నారు. ఫలితంగా బంగ్లాదేశ్ ఏర్పాటుకు సుగమం ఏర్పడింది. భారతదేశంలో హరిత విప్లవం, భారత వ్యవసాయాన్ని ఆధునీకరించడంలో ఆయన అందించిన సహకారం, కేంద్ర వ్యవసాయ మంత్రిగా తన రెండు పదవీకాలాల్లో 1974 కరువు సమయంలో, ఆహార సంక్షోభాన్ని నివారించటానికి ప్రత్యేకంగా అదనపు మంత్రిత్వ శాఖను నిర్వహించమని కోరినప్పుడు అంగీకారం తెలపటం ఎప్పటికీ గుర్తుంచుకోవాల్సిన విషయం. రేపటి భావితరాలు ఇలాంటి స్వతంత్ర సమరయోధుల ఆశయ సాధన కోసం కృషి చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షుడు ఎం. డి ఆర్ ఖలీల్, పట్టణ పోలింగ్ బూత్ అధ్యక్షులు జన్నే మస్తాన్, ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు నల్లన్న , 34 వార్డు తాజా మాజీ కౌన్సిలర్ సోమోభాష ,అనుబంధ సంఘాల నియోజకవర్గ అధ్యక్షులు ఎస్సీ సెల్ సాయి పోగు వీరేష్, ఎస్టీ సెల్ కొనకొండ్ల అంజి, బీసీ సెల్ రంగనాయకులు, రైతు విభాగం బాబురావు యాదవ్, యువజన విభాగం అబ్దుల్ బాసిద్ ,వాలంటరీ విభాగం పవన్ కుమార్ ,మున్సిపల్ వింగ్ కార్యదర్శి ఆర్ డి జి బాష, మైనార్టీ సీనియర్ నాయకులు నూరునిజామి, ఎస్సీ సెల్ సీనియర్ నాయకులు భావన్న, 37 వార్డు ఇంచార్జ్ పరశు రాముడు, రాష్ట్ర పబ్లిసిటీ వింగ్ కార్యదర్శి చిన్న రాయుడు, కార్మిక శాఖ పట్టణ ఉపాధ్యక్షుడు అబ్దుల్ రెహమాన్, అనంత సేనారెడ్డి, తన్వీర్,మోపురి రాజశేఖర్, 14 వార్డు అబ్దుల్ రెహమాన్ రాము, చాంద్ బాష సుబ్బారావు, విజయ్, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

**సిపిఐ ఆధ్వర్యంలో:**
బాబు జగ్జీవన్ రామ్ జయంతి కార్యక్రమాన్ని సిపిఐ కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.జగ్జీవన్ రామ్ సేవలను కొనియాడారు. బడుగు బలహీన వర్గాలు అభ్యున్నతి కోసం ఆయన ఎంతగానో పాటుపడ్డారన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీరభద్ర స్వామి, జిల్లా నాయకులు మహేష్, పట్టణ కార్యదర్శి ఎస్ఎండి గౌస్, రూరల్ కార్యదర్శి రాము రాయల్, పట్టణ ,రూరల్ సహాయ కార్యదర్శులు మురళీకృష్ణ, రామాంజనేయులు యాదవ్, పట్టణ కమిటీ సభ్యులు గోపీనాథ్, ఈశ్వరయ్య, ,దాసరి శ్రీనివాసులు, ఎన్.కొట్టాల నాయకులు ఉమర్ బాష, ఏ ఐ టి యు సి నాయకులు రవి తదితరులు పాల్గొన్నారు.

## అమరావతి ప్రజా రాజధాని..

### మంత్రి టీజీ భరత్ గుప్తా



**అమరావతి ఏప్రిల్ 5(డ్రీమ్ టైమ్స్):**
అమరావతి ప్రజా రాజధాని అని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ గుప్తా అన్నారు. కర్నూల్లోని ఆయన నివాసంలో దీపకాంతుల నడుమ జై అమరావతి- మన రాజధాని అని రాసి సంబరాలు చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత లభించడం ప్రజలందరూ సంతోషించదగ్గ విషయమన్నారు. రాష్ట్ర ప్రజల తరుపున కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఇక రాజధానిగా అమరావతిని ఎవ్వరూ కదిలించలేరన్నారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలోనే ఇది సాధ్యమైందని అన్నారు. అమరావతి ప్రపంచంలోనే పేరుగాంచిన రాజధానిగా నిలిచిపోనుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపీఐఐసీ డైరెక్టర్లు జగదీష్ గుప్తా, సంతోష్, ఏపీఐడీసీ డైరెక్టర్ సందీప్, తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధి జూటూరు రవి, లీగల్ సెల్ కర్నూలు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు గణేష్ సింగ్, టిడిపి నాయకులు వినోద్ చౌదరి, శ్రీధర్, మల్లికార్జున గౌడ్, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు



**బనగానపల్లె , ఏప్రిల్ 5(డ్రీమ్ టైమ్స్):**
మండలంలో బాబు జగ్జీవన్ రామ్ 119 వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు ఆదివారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో బాబు జగ్జీవన్ రామ్ 119జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎంపీడీవో నాగరాజు డిప్యూటీ ఎంపీడీవో బాలాంజనేయులు ల ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు . ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ హమీద్ బుక్ కీపర్లు, పొదుపు మహిళలు పాల్గొన్నారు.

## దళిత సంఘాల ఆధ్వర్యంలో డాక్టర్.బాబు జగ్జీవన్ రామ్ 118వ జయంతి వేడుకలు.



మంత్రాలయంలో బాబు జగ్జీవన్ రావ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న జై భీం ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు చిక్కం జానయ్య, బిఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రామతీర్థం అమరేష్, ఏబు, గర్జి హనున్న, ఇతర దళిత సంఘాల నాయకులు.

**డ్రీమ్స్ టైమ్స్ న్యూస్: మంత్రాలయం : ఏప్రిల్ 5,**
నియోజకవర్గ కేంద్రమైన మంత్రాలయంలో జై భీం ఎంఆర్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు చిక్కం జానయ్య , బిఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రామతీర్థ అమరేష్ , జై భీం ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గర్జి హనుమన్న , దళిత యువజన , విద్యార్థి ప్రజా సంఘాల ఆధ్వర్యంలో డాక్టర్. బాబు జగ్జీవన్ రామ్ 118 వ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ముందుగా రామచంద్ర నగర్ కాలనీలోని ఎస్సీ కాలనీ నుంచి ప్రత్యేక వాహనంలో జగ్జీవన్ రామ్ చిత్రపటాన్ని ఉంచి అక్కడి నుంచి రాఘవేంద్ర కూడలి మీదుగా ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం వరకు డప్పులతో ఊరేగించారు. అనంతరం డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దళిత నాయకులు మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్ర సమరయోధుడు, ప్రజలు కార్మికులు, రైతుల పక్షపాతి మరియు సమానమైన హక్కులు, సమానత్వం, అర్హులైన అందరికీ సంక్షేమ పథకాలు, అందే విధంగా ఆయన పోరాటం సాగిందని కొనియాడారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ఆయనకు భారతరత్న ప్రకటించాలని డిమాండ్ గా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మంత్రాలయం స్థానిక దళిత నాయకులు, మండలం ప్రజా సంఘాల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## యాగంటి దేవస్థానానికి భక్తుల విరాళం



**బనగానపల్లె, ఏప్రిల్ 5(డ్రీమ్ టైమ్స్):**
మండలంలోని ప్రముఖ శైవ క్షేత్రం యాగంటి శ్రీ ఉమామహేశ్వర స్వామి దేవస్థానానికి నెల్లూరు పట్టణానికి చెందిన సత్యం ఆలయ అభివృద్ధికి రూ.10116/- లు విరాళం ఆలయ చైర్మన్ బండి మౌలీశ్వర రెడ్డి, ఆలయ ఈఓ పాండురంగా రెడ్డి లకు ఆదివారం అందజేశారు.

# క్రీస్తు పునరుత్థానం క్రైస్తవ విశ్వాసానికి మూలం-ఫాదర్ జోసఫ్











- నంద్యాలలో ఘనంగా క్రీస్తు పునరుత్థాన వేడుకలు
- క్రీస్తు పునరుత్థానంలో జీవించాలని పిలుపునిచ్చిన దైవ సేవకులు
- ప్రార్థన మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేసిన క్రైస్తవులు

**నంద్యాల ప్రతినిధి, ఏప్రిల్ 5(డ్రీమ్ టైమ్స్):** క్షమించడంలోనే నిజమైన విజయం ఉందని చాటిచెప్పిన క్రీస్తు త్యాగాన్ని స్మరించుకోవాలని, క్రీస్తు పునరుత్థానం క్రైస్తవ విశ్వాసానికి మూల స్తంభం అని నంద్యాల ఆరోగ్య మాత పుణ్యక్షేత్రం డీన్, విచారణ గురువు రెవరెండ్ ఫాదర్ కె. దేవస్య జోసెఫ్ పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ క్రీస్తు పునరుత్థానంలో జీవించాలని ఆయన కోరారు. నంద్యాల జిల్లాలోని ఆయా క్రైస్తవ మందిరాల్లో ఆదివారం క్రీస్తు పునరుత్థాన వేడుకలను అత్యంత ఘనంగా జరుపుకున్నారు. శనివారం రాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు క్రైస్తవులు అత్యంత భక్తిశ్రద్ధలతో జాగరణ, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్థానిక ఆరోగ్య మాత పుణ్యక్షేత్రంలో నిర్వహించిన వేడుకల్లో ఫాదర్ జోసెఫ్ మాట్లాడుతూ దేవుడు తనకు అత్యంత విధేయుడైన తన కుమారుని మరణంలో నుంచి జీవములోనికి దాటించాడన్నారు. ఏసు పునరుత్థానులై మరణాన్ని జయించడం దేవుడి గొప్ప సంకల్పం అని కొనియాడారు. సమాజం మేలుకై సేవా విధానాన్ని శుద్ధ హృదయంతో ఆచరించడం ద్వారా దేవుడి మెప్పు పొందగలమని, దేవుడిపై ఆధారపడిన జీవితాలు పురోగమనం సాధించే స్థితిలో ఉంటుందని తెలిపారు. క్రైస్తవ జీవితానికి క్రీస్తు పునరుత్థానం గొప్ప పునాది అని చెప్పారు. వేడుకల్లో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

# అనారోగ్యంతో ఉన్న జనసే నానికి ఆర్థిక సాయం అందజేత



**గుంతకల్లు, ఏప్రిల్ 5(డ్రీమ్ టైమ్స్):** జనసేన పార్టీ అధినేత కొణిదెల పవన్ కళ్యాణ్ ఆశయాలు, స్ఫూర్తికి అనుగుణంగా పనిచేస్తున్న గుంతకల్లుకు చెందిన నిస్వార్థ జనసైనికుడు లారెన్స్ అకస్మాత్తుగా అనారోగ్యానికి గురై పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గుంతకల్లు నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త వాసగిరి మణికంఠ ఆదివారం పరామర్శించారు. అంతేకాకుండా ఆయనకు.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు.నిస్వార్థ జనసైనికుడు, పవన్ కళ్యాణ్ వీరాభిమాని, పార్టీ కార్యక్రమాల్లో నిత్యం చురుగ్గా పాల్గొంటున్న వ్యక్తి లారెన్స్.. ఉన్నట్టుండి అధిక రక్తపోటు కు గురయ్యి అపస్మారక స్థితికి వెళ్లి పట్టణంలోని సన్ లైఫ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం ఆయన కుటుంబ సభ్యుల ద్వారా తెలుసుకున్న గుంతకల్లు నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త వాసగిరి మణికంఠ పరామర్శించారు. మెరుగైన చికిత్స అందించాలని ఆసుపత్రి వైద్యులతో మాట్లాడి, వారి కుటుంబ సభ్యులకు రూ.10వేల తక్షణ సాయంగా అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యక్రమాల నిర్వహణ కమిటీ సభ్యుడు పవర్ శేఖర్, జనసేన పార్టీ సీనియర్ నాయకులు గాజుల రాఘవేంద్ర, సుబ్బయ్య, దోనిముక్కల విజయ్, అమర్, శ్మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా ఈస్టర్ వేడుకలు



**బనగానపల్లె ,ఏప్రిల్ 5(డ్రీమ్ టైమ్స్):** మండలంలోని పలు చర్చిలలో ఈస్టర్ వేడుకలను క్రిస్టియన్ సోదరులు ఘనంగా నిర్వహించారు. ఆదివారం పట్టణంలోని సిఎస్ఐ చర్చి, మదర్ తెరిసా చర్చిలలో ఈస్టర్ వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సి ఎస్ ఐ చర్చి రెవరెండ్ పాస్టర్ బి దైవాదినం, డిసి హన్నమ్మ ల ఆధ్వర్యంలో క్రీస్తు పునరుత్థాన వేడుకల్లో భాగంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్రైస్తవులకు ఈస్టర్ వేడుకల ప్రాధాన్యతను పాస్టర్ వివరించారు. ఈ కార్యక్రమంలో చర్చి కమిటీ సభ్యులు రవి, మేరీ, జాకోబ్, భాస్కరరావు, కుమారి, చిట్టెమ్మ, రాబర్ట్, ప్రశాంత్ పాల్గొన్నారు.

### శ్రీ.శ్రీ. మహా మాంతేశ్వర స్వామి రథోత్సవంలో పాల్గొన్న ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి జనసేన ఇన్చార్జి మల్లప్ప,,,




**కౌతాళం ఏప్రిల్ 5(డ్రీమ్ టైమ్స్):** మండల పరిధిలోని హల్వి గ్రామంలో శ్రీ. శ్రీ. మహా మహంతిశ్వర స్వామి రథోత్సవంలో ఆదోని బిజెపి ఎమ్మెల్యే పార్థసారథి ఆదోని జనసేన ఇన్చార్జి మల్లప్ప టిడిపి యువ నాయకులు సతీష్ నాయుడు పాల్గొని ఆలయంలో కి వెళ్లి వివిధ రకాల తో ప్రత్యేక పూజలు నిర్వహించి తమ మొక్కలు చెల్లించుకుని పీఠాధిపతులు ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు విక్రం రాజ్ రేణు వర్మ ఇ.హనుమంతు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# పది మంది పేకాట రాయుళ్ళు అరెస్టు

-- రూ. 1లక్షల 41 వేలు , 6 ద్విచక్ర వాహనాల స్వాధీనం


పేకాటలో దొరికిన వాహనాలు, జూదరులతో మాధవరం పోలీసులు.

**డ్రీమ్స్ టైమ్స్ న్యూస్ మంత్రాలయం , ఏప్రిల్ 5**
మంత్రాలయం మండల పరిధిలోని సింగరాజనహళ్ళి గ్రామం శివారులో పేకాట ఆడుతున్న 10 మందిని మాధవరం పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. మంత్రాలయం సిఐ రామాంజులు తెలిపిన వివరాలు మేరకు కౌతాళం మండలం హల్వి గ్రామానికి చెందిన బసయ్య , పెద్దకడుబూర్ మండలం జాలవాడి గ్రామానికి కురువ బీరప్ప , ఆదోని మండలం పెద్దతుంబళం గ్రామానికి చెందిన సూర్పరాజ్ , గౌస్ మొహిద్దిన్ , కోసిగి మండలం బెలగల్ గ్రామానికి చెందిన పెద్ద వీరేష్ , బి వీరేష్ , పెద్ద వీరేష్ , పెద్దకడుబూర్ మండలం మేకడోణ గ్రామానికి చెందిన ఆలంబాష , పెద్దకడుబూర్ మండలం చిన్నతుంబళం గ్రామానికి చెందిన హనుమేష్ , పెద్దకడుబూర్ మండలం కంబలదిన్నె గ్రామానికి చెందిన బోయ ఎల్లప్ప 10 మంది ఊరి బయట అందర్ బహర్ జూదము , 52 పేకా ముక్కలు , ఆడుతుండగా రాబడిన సమాచారం రావడంతో ఎస్ఐ విజయకుమార్ , తన సిబ్బంది తో దాడులు చేసి పట్టుకున్నామన్నారు. వారి వద్ద నుండి రూ. 1,41,000 నగదు , ఆరు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. ఎవరైనా పేకాట, మట్కా, క్రికెట్ బెట్టింగ్ లాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన అట్టి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సిఐ హెచ్చరించారు. ఈ దాడుల్లో మాధవరం హెడ్ కానిస్టేబుల్ వీరేష్ , కానిస్టేబుల్ ఉన్నారు..

# విద్య, సేవా రంగాల్లో అంజద్ భాష సేవలు చిరస్మరణీయం

**రాష్ట్ర మంత్రి ఎన్ఎండి ఫరూక్**




**నంద్యాల ఏప్రిల్ 5(డ్రీమ్ టైమ్స్):** నంద్యాల.... విద్యారంగం మరియు సేవా కార్యక్రమాల్లో అంజద్ భాష అందించిన సేవలు ఎంతో అభినందనీయమని, అవి చిరస్మరణీయంగా నిలిచిపోతాయని రాష్ట్ర మంత్రి ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు. ఉర్దూ ఉపాధ్యాయునిగా సుదీర్ఘ కాలం సేవలు అందించి పదవీ విరమణ చేసిన అంజద్ భాష సిద్ధికిని నంద్యాల జిల్లా ఇమాముల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. స్థానిక కుబ్రా మసీదులో ఏర్పాటు చేసిన ఈ సన్మాన సభకు మంత్రి ఎన్ఎండి ఫరూక్ ముఖ్యఅతిథిగా హాజరై, అంజద్ భాషను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ ప్రస్తుత కూటమి ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, వారి అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు నంద్యాల జిల్లాలోని ఇమాముల సంక్షేమానికి ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఇమాముల సంఘం సభ్యులకు టిట్కో గృహాలను మంజూరు చేస్తామని ఈ సందర్భంగా మంత్రి ప్రకటించారు. ?పదవీ విరమణ అనంతరం కూడా అంజద్ భాష తన సేవా కార్యక్రమాలను మరింత విస్తరింపజేయాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నేషనల్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఇంతియాజ్ అహ్మద్, అంజుమన్ సంస్థ అధ్యక్షులు ఎన్ఎండి కుదుసు, నంద్యాల ఐ.ఎమ్.ఏ కార్యదర్శి డాక్టర్ మహమ్మద్ రఫీ, టూ టౌన్ సీఐ అస్రార్ భాష మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ ఖలీల్ బార అసోసియేషన్ అధ్యక్షులు హుస్సేన్ భాష , నంద్యాల జమాతే ఇస్లాం అధ్యక్షులు అబ్దుల్ సమ్మద్ ఆన్సర్ జ్యువెలర్స్ అధినేత ఆన్సర్ మరియు నంద్యాల జిల్లా ఇమాముల సంఘం నాయకులు మౌలానా మహబూబ్ బాషా , హాఫిజ్ అబ్దుల్ సలాం , హాఫిజ్ అబ్దుల్ రెహమాన్ , హాఫిజ్ రజాక్ , హాఫిజ్ అమీర్ ఖాజా తదితరులు పాల్గొన్నారు. వక్తలు అందరూ అంజద్ భాష విద్య మరియు వైద్య సేవా రంగాలలో చేసిన కృషిని కొనియాడారు.

# ఘనంగా బాబుజగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు



**బనగానపల్లె ఏప్రిల్ 5(డ్రీమ్ టైమ్స్):** పట్టణంలోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం పట్టణంలోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు మూలింటి పెద్ద మునయ్య, రామకృష్ణ ,పసుపుల ఎర్రన్న ల ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కంబగిరి, గిరిజన సంఘం నాయకులు కలింగిరి రాముడు పాల్గొన్నారు. నందవరంలో - మండలంలోని నందవరం గ్రామంలో ఎస్సీ కాలనీ లో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు పూలరాజు ఆధ్వర్యంలో డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాబు జగ్జీవన్ రామ్ ఆశయాలను, ఆయన పోరాటాన్ని గౌరవిస్తూ ఆయనను 'సమతా యోధుడు'గా భారత దేశం స్మరించుకుంటుందని తెలిపారు.

# బిజినెస్

## అరుదైన మైలురాయి చేరుకున్న అమూల్.. ఏడాదిలో లక్ష కోట్ల వ్యాపారం




దేశంలో డైరీ ఉత్పత్తుల్లో అగ్ర సంస్థగా ఉన్న అమూల్ అరుదైన ఘనత సాధించింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో లక్ష కోట్ల వ్యాపార సంస్థగా నిలిచింది. ఈ ఏడాది సంస్థ ఏకంగా 11 శాతం వృద్ధి సాధించింది. అమూల్.. గుజరాత్‌కు చెందిన సంస్థ. ద గుజరాత్ కోఆపరేటివ్ మిల్క్ మార్కెటింగ్ ఫెడరేషన్ లిమిటెడ్ (జీసీఎంఎంఎఫ్) సంస్థ అమూల్ బ్రాండ్‌తో వ్యాపారం నిర్వహిస్తుంటుంది. ఈ ఆర్థిక సంవత్సరంలో 11 శాతం వృద్ధితో, లక్ష కోట్లకుపైగా వ్యాపారాన్ని నిర్వహించినట్లు సంస్థ తాజాగా ప్రకటించింది. ఈ సంస్థ ఇంతకుముందు 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ. 90,000 కోట్ల వ్యాపారం సాధించింది. ఇప్పుడు దీన్ని అధిగమించి, భారీ లాభాలతో లక్ష కోట్లు దాటింది. అమూల్.. దేశంలో టాప్ డైరీ బ్రాండ్‌గా కొనసాగుతోంది. ఈ సంస్థ దాదాపు 1,200 రకాల ఉత్పత్తుల్ని మార్కెటింగ్ చేస్తోంది. ఆధునిక వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు తన మార్కెటింగ్ వ్యూహాల్ని మార్చుకుంటూ వస్తోంది. ఈ ఫెడరేషన్‌లో 18 జిల్లా కో ఆపరేటివ్ సంస్థలు కూడా సభ్యత్వం కలిగి ఉన్నాయి. భారీ లక్ష?ాన్ని చేరుకున్న సందర్భంగా జీసీఎంఎంఎఫ్ చైర్మన్ అశోక్‌భాయ్ చౌదరి స్పందించారు. లక్షలాది మంది వినియోగదారులు, నిరంతరం శ్రమించే 36 లక్షల మంది రైతుల నమ్మకం కారణంగా ఈ విజయం సాధ్యమైందన్నారు. జీసీఎంఎంఎ సంస్థ దేశంలోనే కాకుండా అంతర్జాతీయంగా కూడా అతిపెద్ద డైరీ సంస్థ. ఇందులో 36 లక్షల మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. పాలు, పాల ఉత్పత్తుల్ని 50కిపైగా దేశాల్లో విక్రయిస్తోంది. స్పెయిన్ సహా యూరప్ దేశాల్లో, అమెరికాలోనూ వ్యాపారం చేస్తోంది. రోజూ 31 మిలియన్ లీటర్ల పాలను సేకరిస్తోంది. సంవత్సరానికి 24 బిలియన్ల ప్యాకెట్లు విక్రయిస్తోంది. వీటిలో పాలు, పెరుగు, వెన్న, నెయ్యి, ఐస్ క్రీమ్ వంటి పలు పదార్థాలున్నాయి.

## బంగారం కొనాలనుకునే వారికి అలర్ట్..

**హైదరాబాద్, విజయవాడలో తులం ఎంతుందంటే..?**



బంగారం, వెండి ధరలు నాన్ స్టాప్‌గా పెరిగి రికార్డు స్థాయికి చేరుకున్న విషయం తెలిసిందే.. ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న పరిణామాలు, ఇరాన్, ఇజ్రాయెల్-అమెరికా యుద్ధంతో బంగారం, వెండి ధరలు లక్షా 60వేల మార్క్ దాటాయి.. అయితే.. ఇటీవల తగ్గిన బంగారం ధరలు.. మళ్లీ పెరుగుతూ వస్తున్నాయి.. ఈ క్రమంలోనే.. బంగారం, వెండి ధరలు స్థిరంగా కొనసాగుతున్నాయి. పలు వెబ్‌సైట్ల ఆధారంగా.. ఆదివారం (ఏప్రిల్ 5, 2026 ) ఉదయం ఆరు గంటల వరకు నమోదైన ధరల ప్రకారం.. దేశీయంగా బంగారం, వెండి రేట్లు ఈ కింది విధంగా ఉన్నాయి

-24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ. 1,50,930గా ఉంది.

-22 క్యారెట్ల గోల్డ్ పది గ్రాముల ధర రూ. 1,38,350 గా ఉంది.

వెండి కిలో ధర రూ. 2,50,000 గా ఉంది.

అయితే.. ప్రాంతాల వారీగా బంగారం, వెండి ధరల్లో వ్యాత్యాసం ఉంటుంది.

ప్రధాన నగరాల్లో బంగారం, వెండి ధరలు ఇలా..

హైదరాబాద్‌లో బంగారం 24 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ. 1,50,930, 22 క్యారెట్ల గోల్డ్ 10గ్రాముల ధర రూ. 1,38,350 ఉంది. వెండి కిలో ధర రూ. 2,55,000 ఉంది.

విజయవాడ, విశాఖపట్నంలో 24 క్యారెట్ల పసిడి 10 గ్రాముల ధర రూ. 1,50,930, 22 క్యారెట్ల గోల్డ్ 10గ్రాముల ధర రూ. 1,38,350 ఉంది. వెండి కిలో ధర రూ. 2,55,000 ఉంది.

ఢిల్లీలో 24 క్యారెట్ల గోల్డ్ 10 గ్రాముల ధర రూ. 1,51,080, 22 క్యారెట్ల ధర రూ. 1,38,500 గా ఉంది. వెండి కిలో ధర రూ. 2,50,000 ఉంది.

ముంబైలో 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ. 1,50,930, 22 క్యారెట్ల ధర రూ. 1,39,500 గా ఉంది. వెండి కిలో ధర రూ. 2,50,000 లుగా ఉంది.

చెన్నైలో 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ. 1,52,180, 22 క్యారెట్ల ధర రూ. 1,39,500 ఉంది. వెండి కిలో ధర రూ. 2,55,000 లుగా ఉంది.

బెంగళూరులో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ. 1,50,930, 22 క్యారెట్ల ధర రూ. 1,38,350 ఉంది. వెండి కిలో ధర రూ. 2,50,000 లుగా ఉంది.

## సుజుకీ సరికొత్త స్కూటర్.. ప్రారంభ ధర రూ 1.01 లక్షలు

**న్యూఢిల్లీ,**

ప్రముఖ ద్విచక్ర వాహన సంస్థ సుజుకీ మోటర్‌సైకిల్... దేశీయ మార్కెట్లోకి మరో మాడల్‌ను తీసుకొచ్చింది. నూతన బర్గ్‌మ్యాన్ స్ట్రీట్ పేరుతో విడుదల చేసిన ఈ ఈ స్కూటర్ రెండు రకాల్లో లభించనున్నది. ఈ స్కూటర్ ప్రారంభ ధర రూ. 1,01,944గా నిర్ణయించిన సంస్థ... గరిష్ఠంగా రూ. 1,13,200కి విక్రయించనన్నది. ఈ ధరలు న్యూఢిల్లీ షోరూంనకు సంబంధించినవి. 2026 సంవత్సరానికిగాను విడుదల చేసిన ఈ మాడల్‌లో నూతన డ్యూయల్ ఎల్‌ఈడీ హెడ్‌ల్యాంప్స్, స్టోరేజ్‌ను 21.5 లీటర్ల



నుంచి 24.6 లీటర్లకు పెంచింది. యూఎస్‌బీ చార్జింగ్, 4.2 ఇంచుల టీఎఫ్‌టీ , కీలెస్ సిస్టమ్, 124 సీసీ ఇంజిన్, సింగిల్ సిలిండర్ 8.2 బీహెచ్‌పీల శక్తినివ్వనున్నది. గంటకు 60 కిలోమీటర్ల వరకు వేగంతో ప్రయాణించనున్న ఈ స్కూటర్‌ను యువతను దృష్టిలో పెట్టుకొని పలు మార్పులు చేసింది.

# స్పోర్ట్స్

## సొంతగడ్డపై ఆర్సీబీకి భారీ విజయం..!

**డేవిడ్ సిక్సర్ల మోతకు అల్లాడిన సూపర్ కింగ్స్..**

సొంత ఇలాకాలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు గర్జించింది. చిన్నస్వామి స్టేడియంలో బ్యాటర్ల ఊచకోతకు, బౌలర్ల వికెట్ల వేట తోడవ్వగా ఆర్సీబీ పరుగులతో భారీ విజయం సాధించింది. టిమ్ డేవిడ్(70 నాటౌట్), దేవ్‌దత్ పడిక్కల్(50) మెరుపులతో కొండంత స్కోర్ కొట్టిన బెంగళూరు.. పవర్ ప్లేలోనే చెన్నై సూపర్ కింగ్స్‌ను ఓటమి అంచుల్లోకి నెట్టింది. టాపార్డర్ కుప్పకూలిన చోట సర్ఫరాజ్ ఖాన్(50), ప్రశాంత్ వీర్(43)లు బ్యాట్ ఝులిపించారు. ఆఖర్లో జేమీ ఓవర్టన్(37) ధనాధన్ ఆడినా సరిపోలేదు. ఫలితంగా చెన్నై ఖాతాలో హ్యాట్రిక్ ఓటమి చేరింది. పంతొమ్మిదో సీజన్‌లో రికార్డు స్కోర్ బాదిన ఆర్సీబీ వరసగా రెండో విజయం నమోదు చేసింది. చిన్నస్వామి స్టేడియంలో ప్రత్యర్థి నిర్దేశించిన కొండంత లక్ష్యాన్ని చూసి నీరుగారిపోయిన సూపర్ కింగ్స్ ఏ దశలోనూ గెలుపు దిశగా సాగలేదు. బౌలర్లు విఫలమైన చోట బ్యాటర్లూ 'మేము ఆడలేమంటూ' చేతులెత్తేశారు.



జాకబ్ డఫ్ఫీ వేసిన తొలి ఓవర్లో సిక్సర్ బాదిన రుతురాజ్ గైక్వాడ్(7) సులువుగా వికెట్ ఇచ్చేయగా.. గత మ్యాచ్‌లో అర్ధ శతకంతో రెచ్చిపోయిన ఆయుష్ మాత్రే(1)ను భువనేశ్వర్ ఔట్ చేశాడు. భారీ స్కోర్ బాకీ పడిన సంజూ శాంసన్ మరోసారి నిరాశపరుస్తూ 9 పరుగులకే వెనుదిరిగాడు.

**సర్ఫరాజ్ మెరిసినా..**

డఫ్ఫీ, భువనేశ్వర్‌ల విజృంభణతో 30 కే మూడు బిగ్ వికెట్లు పడిన వేళ సర్ఫరాజ్ ఖాన్(50), ఇంప్యాక్ట్ సబ్ కార్తిక్ శర్మ(6)లు బౌండరీలతో స్కోర్ బోర్డును నడిపించారు. అయితే.. కృనాల్ పాండ్యా(2-36) ఒకే ఓవర్లో వీరిద్దరని పెవిలియన్ పంపి చెన్నైని మరింత కష్టాల్లోకి నెట్టాడు. శివం దూబే(18) కాసేపు అలరించాడంతే. ప్రశాంత్ వీర్(43), జేమీ ఓవర్టన్(37)లు ఆర్సీబీ బౌలర్లను ప్రతిఘటించారు. స్కోర్ 100 దాటించి ఆరో వికెట్‌కు 57 రన్స్ జోడించిన ఈ ద్వయాన్ని డైవింగ్ క్యాచ్‌తో పాటిదార్ విడదీశాడు. కాసేపటికే ఓవర్టన్ ఇన్నింగ్స్ ముగియగా.. సీఎస్కే 207 పరుగులకే పరిమితమైంది.

**ఆ ఇద్దరూ.. ఆకాశమే హద్దుగా**

సొంత గడ్డపై రాయల్ ఛాలెంజర్స్ బ్యాటర్లు పూనకాలు వచ్చినట్టే చెలరేగారు. ఓపెనర్లు శుభారంభమివ్వగా.. దానికి రెండింతలు అన్నట్టు మిడిలార్డర్ బ్యాటర్లు సుడిగాలి ఇన్నింగ్స్‌తో చెన్నై సూపర్ కింగ్స్ బౌలర్ల భరతం పట్టారు. ఫలితంగా ఈ సీజన్‌లో అత్యధిక స్కోర్ నమోదు చేసింది ఆర్సీబీ. పవర్ ప్లేలోనే విరాట్ కోహ్లీ(28) ఔటైనా.. దేవ్‌దత్ పడిక్కల్(50) జతగా ఫిలిప్ సాల్ట్(46) స్కోర్ బోర్డును ఉరికించాడు. అర్ధ శతకానికి చేరువైన సాల్ట్‌ను దూబే వెనక్కి పంపాడు.

## అప్పుడే ఐపీఎల్ బరిలోకి ధోనీ.. హింట్ ఇచ్చిన సీఎస్కే సారథి..!




పంతొమ్మిదో సీజన్‌లో బోణీ కోసం నిరీక్షిస్తున్న చెన్నై సూపర్ కింగ్స్‌కు మరో షాక్. అనుభవజ్ఞుడు, మాజీ సారథి మహేంద్ర సింగ్ ధోనీ (మీా ణష్త్రశీఅఱ) రెండు వారాల కంటే ఎక్కువ రోజులే ఐపీఎల్‌కు దూరమయ్యే అవకాశముంది. చిన్నస్వామిలో ఆదివారం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో మ్యాచ్ టాస్ సందర్భంగా ధోనీ గురించి చెన్నై కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్(=బ్బతీుఱ +ుఱఎఱుం) కీలక విషయం వెల్లడించాడు. ఐపీఎల్ ఆరంభ నుంచి ఆడుతున్న ధోనీ ఈసారి ఇంకా మైదానంలోకి దిగలేదు. టోర్నీ మొదలై వారం కావొస్తున్నా తాలా పునరాగమనంపై ఉత్కంఠ కొనసాగుతోంది. మొదట రెండువారాలే అందుబాటులో ఉండడని సూపర్ కింగ్స్ యాజమాన్యం చెప్పినా.. ఆ సమయం మరింత పెరిగేలా కనిపిస్తోంది. స్వయంగా ఆ జట్టు కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ టాస్ సందర్భంగా ధోనీ గురించి బిగ్ అప్డేట్ ఇచ్చాడు. 'ధోనీ నెమ్మదిగా కోలుకుంటున్నాడు. కొన్నిసార్లు మరింత సమయం పట్టొచ్చు. అతడు మ్యాచ్ ఆడేందుకు సిద్దంగా ఉంటే కచ్చితంగా ఆడిస్తాం. అయితే.. అందుకు కాస్త టైమ్ పట్టేలా ఉంది' అని గైక్వాడ్ తెలిపాడు. కెప్టెన్‌గా ఐదు ట్రోఫీలు కట్టబెట్టిన ధోనీ గైర్హాజరీలో సీఎస్కే పరాజయాల పరంపర కొనసాగుతోంది. తొలి పోరులో రాజస్థాన్ రాయల్స్.. రెండో మ్యాచ్ పంజాబ్ ధాటికి చెన్నై తేలిపోయింది. ఈ నేపథ్యంలో ఆదివారం ఆర్సీబీతో మ్యాచ్ కోసం టీమ్ బస్సులో ధోనీ కెప్టెన్, జట్టు సభ్యులతో కలిసి చిన్నస్వామికి వచ్చాడు. దాంతో.. వారంలోపు తాలా ఫిట్‌నెస్ సాధించి.. మ్యాచ్‌కు సిద్ధమయ్యే అవకాశముందనే వార్తలు వినిపిస్తున్నాయి.

## చెత్త రికార్డులో రోహిత్ సరసన చేరిన అభిషేక్ శర్మ..!

**స్పోర్ట్స్ డెస్క్**

హైదరాబాద్‌లోని ఉప్పల్ వేదికగా(ఆదివారం) లఖ్‌నవూతో జరిగిన మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ యువ సంచలనం అభిషేక్ శర్మ ఓ చెత్త రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. ఒకే ఏడాదిలో అత్యధిక సార్లు సున్నా పరుగులకే వెనుదిరిగిన భారత ఆటగాళ్ల జాబితాలో రోహిత్ శర్మ , సంజు శాంసన్ సరసన అభిషేక్ నిలిచాడు. ఇక పూర్తి వివరాల్లోకి వెళ్తే...టాస్ గెలిచిన లఖ్‌నవూ కెప్టెన్ రిషబ్ పంత్ ముందుగా బౌలింగ్ ఎంచుకున్నాడు. దీంతో తొలుత బ్యాటింగ్‌కు దిగిన సన్ రైజర్స్ ఇన్నింగ్స్ ఆరంభం నుంచే తడబడింది. ఓపెనర్లు ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మలపై భారీ అంచనాలు ఉన్నప్పటికీ, మహ్మద్ షమీ అదిరిపోయే వ్యూహంతో వారిని దెబ్బతీశాడు. ఇన్నింగ్స్ తొలి ఓవర్ చివరి బంతికే షమీ వేసిన 'స్లోయర్'



డెలివరీని అర్థం చేసుకోవడంలో అభిషేక్ పూర్తిగా విఫలమయ్యాడు. బంతి బ్యాట్ అంచుకు తగిలి షార్ట్ థర్డ్ దిశగా వెళ్లగా, అక్కడ ఉన్న మనిమారన్ సిద్ధార్థ్ అద్భుతమైన డైవ్‌తో క్యాచ్ పట్టాడు. దీంతో అభిషేక్ ఖాతా తెరవకుండానే పెవిలియన్ చేరాడు. ఈ డకౌట్‌తో అభిషేక్ శర్మ ఒకే సంవత్సరం(2026)లో ఆరోసారి సున్నాకే అవుట్ అయ్యాడు. గతంలో 2018లో టీమిండియా స్టార్ ప్లేయర్ రోహిత్ శర్మ, 2024లో సంజు శాంసన్ కూడా ఒకే ఏడాదిలో ఆరు సార్లు డకౌట్ అయ్యారు. తాజాగా ఈ యువ ఓపెనర్ కూడా వారి సరసన చేరి అభిమానులను నిరాశపరిచాడు. సన్ రైజర్స్ తరపున ఐపీఎల్‌లో అత్యధిక సార్లు డకౌట్ అయిన ఆటగాళ్ల జాబితాలో రషీద్ ఖాన్ (9), భువనేశ్వర్ కుమార్ (5) తొలి రెండు స్థానాల్లో నిలిచారు. 4 డకౌట్లతో అభిషేక్ శర్మ మూడో స్థానంలో ఉన్నాడు.







## టొవినో థామస్ 'పళ్లిచట్టంబి'
# తెలుగు ట్రైలర్ విడుదల

మలయాళ స్టార్ హీరో టొవినో థామస్ ప్రధాన పాత్రలో నటిస్తున్న పీరియడ్ యాక్షన్ డ్రామా 'పళ్లిచట్టంబి' . వరల్డ్ వైడ్ ఫిలిమ్స్ ఈ సినిమాను నిర్మిస్తుండగా.. ఈ చిత్రం ఏప్రిల్ 10న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా సినిమా నుంచి తాజాగా ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్.ఇక ట్రైలర్ చూస్తుంటే.. చారిత్రక నేపథ్యంలో సాగే సినిమా అని తెలుస్తుంది. ఇందులో టొవినో థామస్ ఒక మాస్ మరియు పవర్‌ఫుల్ లుక్‌లో కనిపిస్తున్నారు. 19వ శతాబ్దపు కేరళ సామాజిక పరిస్థితులను కళ్లకు కట్టినట్లు చూపించబోతున్నారని అర్థమవుతోంది. 'క్వీన్', 'జన గణ మన' వంటి సెన్సేషనల్ హిట్స్ అందించిన డిజో జోస్ ఆంటోనీ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తుండగా. కయాడ్‌లోహార్ కథానాయికగా నటిస్తుంది. 'పళ్లిచట్టంబి' అంటే ఆ కాలంలో ఒక ప్రాంతానికి రక్షకుడిగా ఉన్న వ్యక్తి అని అర్థం. మలయాళంతో పాటు తెలుగు, తమిళం, కన్నడ మరియు హిందీ భాషల్లో ఈ చిత్రం గ్రాండ్‌గా విడుదల కాబోతుంది.

# అందంతో గత్తరలేపిన రాజాసాబ్ ముద్దుగుమ్మ రిద్ది కుమార్..

అందాల ముద్దుగుమ్మ రిద్ది కుమార్.. ఈ అమ్మడు రాజ్ తరుణ్ హీరోగా నటించిన లవర్ అనే సినిమాతో టాలీవుడ్ ఇండస్ట్రీలోకి అరంగేట్రం చేసింది. లవర్ సినిమాలో అందం, అభినయంతో కట్టిపడేసింది రిద్ది కుమార్. చాలా కాలం గ్యాప్ తీసుకున్న తర్వాత ప్రభాస్ నటించిన రాధేశ్యామ్ సినిమాలో కీలకపాత్రలో కనిపించింది.ఈ సినిమాలో ఆమె చేసింది చిన్న పాత్రే అయినా తన నటనతో ఆకట్టుకుంది ఈ చిన్నది. రాధేశ్యామ్ సినిమాలో ఒక చిన్న పాత్రలు తళుక్కున మెరిసింది ఈ ముద్దుగుమ్మ. రాధేశ్యామ్ సినిమాలో అర్చరీ ప్లేయర్ గా కనిపించింది. ఈ బ్యూటికి అనుకున్నంతగా అవకాశాలు కూడా టాలీవుడ్ లో రావడం లేదు.ఇటీవలే ప్రభాస్ హీరోగా నటించిన రాజా సాబ్ సినిమాలో నటించింది. రాజా సాబ్ సినిమాలో ఓ హీరోయిన్ గా నటించింది కానీ ఈ సినిమా కూడా ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేకపోయింది. రాజాసాబ్ సినిమాలో గ్లామరస్ గా కనిపించి కవ్వించింది ఈ సుందరి. కానీ తెలుగులో పెద్దగా ఆఫర్స్ అందుకోలేకపోతుంది. అలాగే అటు మలయాళంలోనూ వరుస ఆఫర్స్ వస్తున్నాయి. తాజాగా ఈ బ్యూటీ లేటేస్ట్ ఫోటోస్ సోషల్ మీడియాలో వైరలవుతున్నాయి. నెట్టింట గ్లామరస్ ఫోటోలు షేర్ చేస్తూ కవ్విస్తుంది. కెరీర్ తొలినాళ్లలో ఈబ్యూటీ గ్లామర్ రోల్స్ చేసేందుకు అంతగా ఆసక్తి చూపించలేదు. దీంతో ఈ భామకు అవకాశాలు అంతగా రావడం లేదని టాక్ వినిపిస్తుంది. ప్రస్తుతం గ్లామర్ రోల్స్ లోనూ కనిపిస్తూ మెప్పిస్తుంది రిద్ది కుమార్.




## బర్త్‌డే స్పెషల్..
## 'మైసా' నుంచి రష్మిక వైల్డ్ లుక్ పోస్టర్




నేషనల్ క్రష్ రష్మిక మందన్న పుట్టినరోజు (ఏప్రిల్ 5) సందర్భంగా ఆమె నటిస్తున్న తాజా చిత్రం 'మైసా' నుంచి మేకర్స్ ఒక పవర్‌ఫుల్ అప్‌డేట్ ఇచ్చారు. ఈ సినిమా నుంచి రష్మికకు సంబంధించిన ఒక ఇంటెన్స్ అండ్ వైల్డ్ పోస్టర్‌ను చిత్ర బృందం విడుదల చేసింది. 'ఆమె తన మనోహరమైన రూపంతో మనసులను దోచుకుంది... తన హుందాతనంతో అందరినీ గెలుచుకుంది... ఇప్పుడు ఆమె కేవలం రౌద్రంతో మన ముందుకు రాబోతోంది. ఎప్పటికీ అద్భుతంగా ఉండే రష్మికకు 'మైసా' టీమ్ తరఫున పుట్టినరోజు శు భాకాంక్షలు. థియేటర్లలో ఆమె రౌద్ర ప్రదర్శనను చూడటానికి సిద్ధంగా ఉండండంటూ' చిత్రబృందం రాసుకోచ్చింది.ఈ పోస్టర్‌లో రష్మిక మునుపెన్నడూ లేని విధంగా చాలా 'రా అండ్ రస్టిక్' లుక్‌లో కనిపిస్తోంది. ముఖంపై రక్తపు చారలు, గాయాలతో ఉన్నప్పటికీ.. ఆమె కళ్ళలో కనిపిస్తున్న పట్టుదల మరియు తీవ్రత ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. ఈ చిత్రంలో రష్మిక ఒక పవర్‌ఫుల్ గోండు తెగకు చెందిన మహిళగా నటిస్తున్నట్లు సమాచారం. ఇది ఒక ఫిమేల్ సెంట్రిక్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతోంది. ఈ సినిమాతో రవీంద్ర పుల్లె దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. అన్‌ఫార్ములా ఫిల్మ్స్ బ్యానర్‌పై రూపొందుతున్న ఈ భారీ పాన్-ఇండియా చిత్రానికి జేక్స్ బిజోయ్ సంగీతాన్ని అందిస్తున్నారు. ఈ పవర్‌ఫుల్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 2026 లోనే ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

## రాయలసీమ
# అభిమానులతో రణబాలి




వివాహానంతరం విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న కలిసి నటిస్తున్న చిత్రం 'రణబాలి'. 19వ శతాబ్దంలో జరిగిన యథార్థ చారిత్రక సంఘటనల ఆధారంగా తెరకెక్కుతున్న ఈ పీరియాడిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌కి రాహుల్ సంకృత్యాన్ దర్శకుడు. మైత్రీ మూవీమేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఈ ఏడాది సెప్టెంబర్ 11న విడుదల కానున్నది. తాజాగా ఈ సినిమా అనంతపూర్ షెడ్యూల్ కంప్లీట్ చేసుకున్నది. ఈ సందర్భంగా అక్కడి స్థానికులు, అభిమానులు బైక్ ర్యాలీని నిర్వహించి, నూతనజంట విజయ్ దేవరకొండ, రష్మిక మందన్నల పట్ల అభిమానాన్ని చాటుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన ఫ్యాన్‌మీట్‌లో రాయలసీమ అభిమానులను విజయ్ దేవరకొండ కలుసుకొని ఆనందంగా గడిపారు. రాయలసీమకు ఎప్పుడు వచ్చినా సొంతూరుకి వచ్చిన అనుభూతి కలుగుతుందని విజయ్ దేవరకొండ అన్నారు. ఇందులో విజయ్ దేవరకొండ 'రణబాలి' అనే యోధుడిగా నటిస్తుండగా, అతని భార్య జయమ్మగా రష్మిక మందన్న కనిపించనున్నది.

Printer. Publisher and owned by Dr k Soumya, and printed it kalanjali offset printers, shop no.23, sowjanya complex, N.K road , Srinivas Nagar, nandyal-518501 shop no 7, Sai revenue complex, mro office complex, nandyal town -518501 nandyal district (AP) editor: Dr k Sowmya. Email: editor@dream Times.in, editor@dream Times.co.in, cell:8500066609,RNI NO:APTEL 2021/81831